www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
05 జూలై 2023
సంపుటి:1 సంచిక:255

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



# టీ బీజేపీ సారథ్యం..
# కిషన్ రెడ్డికే..

- బండి సంజయ్ రాజీనామా
- కేంద్ర మంత్రి ఇస్తారంటూ ఊహాగానాలు
- ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ గా ఈటల
- బండి మద్దతుదారుల తీవ్ర అసంతృప్తి
- సోషల్ మీడియాలో పోస్టుల వెల్లువ
- రఘునందన్ రావుకు నిరాశే..
- రాజగోపాల్ రెడ్డి చూపు కాంగ్రెస్ వైపు?

**హైదరాబాద్ - విశాలభారతి :** అందరూ ఊహించింది జరిగింది. బీజేపీ స్టేట్ చీఫ్ ను మార్చబోతున్నారంటూ చాలా రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. బండి సంజయ్ స్థానంలో కిషన్ రెడ్డిని నియమించబోతున్నారంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ ఊహాగానాలే నేడు నిజమయ్యాయి. కిషన్ రెడ్డిని టీ బీజేపీ స్టేట్ చీఫ్ గా నియమించారు. అంతకుముందు ఢిల్లీలో ఉన్న బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయనకు కేంద్ర సహాయ మంత్రి పదవి ఇస్తారంటూ జోరుగా ఊహాగానాలు వస్తున్నాయి. మరోవైపు హైకమాండ్ నిర్ణయం పట్ల బండి అభిమానులు, ఆయన ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు చాలా రోజులగా అసంతృప్తిగా ఉన్న ఈటల రాజేందర్ కు కూడా ఓ పదవి దక్కింది. ఆయనను ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ గా నియమించారు. అయితే కేంద్ర మంత్రి పదవిని వదులుకొనేందుకు కిషన్ రెడ్డి సిద్ధంగా లేరని సమాచారం. దీంతో ఆయనకు రెండు పదవులు ఇస్తారా? అన్నది వేచి చూడాలి. ఈ పరిణామాలు ఇలా ఉంటే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీని వీడబోతున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఆయన కాంగ్రెస్ నేత పొంగులేటితో భేటీ అవ్వడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

**కిషన్ రెడ్డి ప్రొఫైల్ ఇదే..**

కిషన్ రెడ్డి భారతీయ జనతా పార్టీలో కింది స్థాయి నుంచి ఎదిగిన నేత. 1977లో జనతా పార్టీలో యువనాయకుడిగా

..మిగతా 2 లో




# అల్లూరి పోరాటం అసమానం

## ఆయన యుద్ధ నైపుణ్యం ప్రత్యేకం
## ఆ చరిత్ర భవిష్యత్ తరాలకు అందించాలి
## రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

**హైదరాబాద్ - విశాలభారతి:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం, దేశ భక్తి అసమానమైనదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ద్రౌపది ముర్ము మాట్లాడుతూ... ''నేతాజీ పోరాటం వలే అల్లూరి సీతారామరాజు పోరాటం కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపింది. మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు భద్రంగా అందించాలి. అల్లూరి ఒక ప్రత్యేకమైన

..మిగతా 2 లో



## సత్యవతికే మహబూబాబాద్

# టికెట్..!

## ఇప్పటికే మంత్రికి అధిష్టానం సంకేతాలు

- కేసీఆర్ డిసైడ్ అయినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ
- సీఎం సంకేతాలతో దూకుడు పెంచిన సత్యవతి వర్గం
- డోర్నకల్ నుంచి కవితకే దాదాపు సీటు ఖరారు
- వివాదాల కారణంగా సిట్టింగ్ ఎమ్మెల్యేకు సీటు నిరాకరణ
- పార్టీ గెలుపే లక్ష్యంగా సాగుతున్న బీఆర్ఎస్ వ్యూహాలు

2లో



## ప్రధాని మోడీ వరంగల్ షెడ్యూల్ ఖరారు

### ప్రధాని మోడీ వరంగల్ షెడ్యూల్ ఖరారు

**హైదరాబాద్ విశాలభారతి :** ప్రధాని మోడీ వరంగల్ షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 8న ప్రధాని మోడీ వరంగల్‌లో పర్యటించనున్నారు. 8వ తేదీన ఉదయం ఢిల్లీ నుంచి బయల్దేరి 9.45 గంటలకి హైదరాబాద్‌లోని హకీంపేట విమానాశ్రయానికి ప్రధాని మోడీ చేరుకుంటారు. 9.50 గంటలకు హెలికాప్టర్‌లో వరంగల్‌కు

..మిగతా 2 లో



## ఎంబీబీఎస్ విద్యార్థులకు గుడ్ న్యూస్

**తెలంగాణ స్టేట్ బ్యూరో విశాలభారతి :** వైద్య విద్య చదవాలనుకునే తెలంగాణ విద్యార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజీల అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ రీఆర్గనైజషన్

..మిగతా 2 లో



## తెలంగాణకు మరో భారీ పెట్టుబడి

### మంత్రి కేటీఆర్‌తో సమావేశం.. ఆరిజన్ ఫార్మా సంస్థ ప్రకటన

**హైదరాబాద్ విశాలభారతి :** తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతుంది. తాజాగా మరో భారీ పెట్టుబడి వచ్చింది. ఆరిజెన్ ఫార్మా సంస్థ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఫార్మా సంస్థ జీనోమ్ వ్యాలీలో 40 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. 250 మందికి పైగా ఉపాధి కల్పించనుంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో బయో మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. మంత్రి కేటీఆర్‌తో సమావేశం అనంతరం ఆరిజెన్ ఫార్మా సంస్థ ఈ విషయాన్ని ప్రకటించింది. ఆరిజెన్ ఫార్మా సంస్థ నిర్ణయంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.



### ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా
## యువత పోరాడాలి

- సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు

**ఇల్లందు - విశాలభారతి :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు పరకాల నాగన్న అన్నారు. ఇల్లందు పట్టణంలో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర మహాసభల సందర్భంగా ఇల్లందు పురవీధులలో యువకులు చేతిన బిగిపిడికిలి జెండా పట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగసభ నిర్వహించారు. వైఎల్ రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడుతూ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏండ్లు గడిచిన నేటికి నిరుద్యోగ సమస్యలనుపరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు.

2లో



## కాంగ్రెస్ లోకి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ..?

### పొంగులేటిని కలిసిన రాజగోపాల్‌రెడ్డి.. కాంగ్రెస్‌లో చేరికపై చర్చ

**హైదరాబాద్ - విశాలభారతి :** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయాలు సరికొత్త మలుపులు తిరుగుతున్నాయి. అసెంబ్లీ సమరం ముంగిట నిలిచిన తెలంగాణలో జనం నాడీపట్టేందుకు పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. ఇప్పటికే అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటలతూటలు పేలుతున్నాయి. కర్ణాటక గెలుపుతో ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్లో జూలై 2న ఖమ్మంలో జరిగిన రాహుల్ సభ మరింత జోష్ నింపిందనే చెప్పుకోవచ్చు.

**పొంగులేటితో రాజగోపాల్ రెడ్డి భేటీ..**

ఖమ్మంలో జరిగిన తెలంగాణ జనగర్జన సభలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్రె డ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో


..మిగతా 2 లో



### కాంగ్రెస్‌లో కొనసాగుతున్న
## చేరికల పర్వం

- రేవంత్ సమక్షంలో పెద్ద ఎత్తున చేరికలు

5 లో



## దత్తత వెళ్తే ఇక అంతే

- పుట్టిన కుటుంబం ఆస్తిలో వాటా ఉండదు
- హైకోర్టు కీలక తీర్పు

5 లో

# టీ బీజేపీ సారథ్యం.. కిషన్ రెడ్డికే..

మొదటిపేజీ తరువాయి

ప్రస్థానం ప్రారంభించారు. 1980లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం నంచి ఆ పార్టీలో పని చేస్తున్నారు. 1980లోనే రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా యువమోర్చా కన్వీనర్ పదవి చేపట్టారు. 1985లో ఉమ్మడి రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు అయ్యారు. యువమోర్చాలో అనేక పదవులు నిర్వహించారు. 2001లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారిగా, 2004లో భారతీయ జనతా యువమోర్చా జాతీయ అధ్యక్ష పదవులను నిర్వహించారు. 2010, మార్చి 6న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు.

కిషన్ రెడ్డి 2004లో తొలిసారిగా హిమాయత్ నగర్ శాసనసభ స్థానం నుంచి విజయం సాధించి రాష్ట్ర శాసనసభలో అడుగుపెట్టారు. 2009 ఎన్నికలలో అంబర్ పేట్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి 27000 పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2014 ఎన్నికలలో మూడో సారి గెలిచారు. 2014 లో మరల తెలంగాణ జనతా పార్టీ అధ్యక్షుడిగా రెండో సారి బాధ్యతలు చేపట్టారు. కిషన్ రెడ్డి 2018 లో ఎమ్మెల్యేగా పోటీ చేసి టీఆరెస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ చేతిలో ఓటమి పాలైనా 2019 లో జరిగిన పార్లమెంట్ ఎలెక్షన్ల లో సికింద్రాబాద్ నుండి గెలిచి క్యాబినెట్ మంత్రి అయ్యారు.

### కలుపుకుపోతారనే కీలక పదవి..

తెలంగాణ బీజేపీలో నెలకొన్న పరిణామాలతో బండి సంజయ్ ను మార్చాలని హైకమాండ్ అనుకున్నప్పటికీ ఈటల రాజేందర్ సహా పలు పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈటల రాజేందర్ ఇటీవలే పార్టీలో చేరారు. ఆయనకు పదవి ఇస్తే..సుదీర్ఘ కాలంగా పార్టీలో ఉన్న వారు అసంతృప్తికి గురవుతారన్న ఉద్దేశంతో .. సీనియర్ నేత అయిన కిషన్ రెడ్డి వైపు మొగ్గు చూపినట్లుగా భావిస్తున్నారు. అందర్నీ కలుపుకుని వెళ్లడంలో కిషన్ రెడ్డి చొరవ చూపిస్తారని భావిస్తున్నారు. అయితే బీజేపీలో జోడు పదవుల సంప్రదాయం లేదు. కేంద్ర మంత్రిగా ఉంటే.. రాష్ట్ర బీజేపీ పదవికి న్యాయం చేయలేరన్న ఉద్దేశంతో పార్టీ పదవి లేదా కేంద్రమంత్రి పదవి ఏదో ఒకటి కేటాయిస్తూ ఉంటారు. ఇప్పుడు కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా కూడా కొనసాగుతారాలేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. తొలగింపునకు గురైన తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్‌కు కేంద్రమంత్రి పదవి ఇస్తారని అంటున్నారు.

# అల్లూరి పోరాటం అసమానం

మొదటిపేజీ తరువాయి


యుద్ధ నైపుణ్యంతో ఆంగ్లేయులపై పోరాటం చేశారు'' అని రాష్ట్రపతి వివరించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఏర్పాటు చేసిన అల్లూరి 30 అడుగుల కాంస్య విగ్రహం, స్మృతి వనాన్ని హైదరాబాద్ నుంచి రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించారు.

**కొత్త తరానికి స్ఫూర్తి: సీఎం కేసీఆర్**

అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు కొత్త తరానికి ఆయన పోరాట స్ఫూర్తిని తెలియజేశాయని సీఎం కేసీఆర్ అన్నారు. ''బ్రిటీష్ బంధనాల నుంచి భారతమాత విముక్తి కోసం పోరాడిన మన్యం వీరుడు అల్లూరి. అల్లూరి గొప్పతనాన్ని.. చరిత్రను ముందు తరాలకు తీసుకెళ్లాలి. అల్లూరి సీతారామరాజు దైవాంశ సంభూతుడని భావిస్తా. మహా కవి శ్రీశ్రీ అల్లూరి గురించి రాసిన 'తెల్లవారి గుండెల్లో నిదురించిన వాడా.. మాలో నిదురించిన పౌరుషాగ్ని రగిలించిన వాడా' సినిమా పాట చాలా పాపులర్ అయింది. ఆ పాటను నేను చాలా ఇష్టంగా వినేవాడిని. 26 సంవత్సరాల పిన్న వయసులోనే రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారు. భరతజాతి చెప్పుకొనే ఎంతో మంది అమరవీరుల సరసన మేము తక్కువ కాదు అని మన తెలగుజాతిని నిలబెట్టిన గొప్ప మహనీయుడు అల్లూరి'' అని సీఎం కేసీఆర్ కొనియాడారు.

# దత్తత వెళ్తే ఇక అంతే...

హైదరాబాద్ - విశాలభారతి :



దత్తత వెళ్లిన వ్యక్తికి ఆస్తి వాటాలు చెందుతాయా అనే విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దత్తతకు వెళ్లకముందు భాగ పరిష్కారం జరిగి వాటా కేటాయించినట్లయితే.. ఆ ఆస్తిపై మాత్రమే హక్కు ఉంటుందని తెలిపింది. దత్తతకు వెళ్లకముందు ఎలాంటి కేటాయింపులు లేకపోతే జన్మించిన కుటుంబానికి చెందిన ఆస్తిలో వాటా ఉండదంటూ కీలక తీర్పు వెలువరించింది. దత్తత వెళ్లినప్పటికీ జన్మించిన కుటుంబం ఆస్తిలో వాటా ఉంటుందంటూ ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలానికి చెందిన ఎ.వి.ఆర్.ఎల్.నరసింహారావు ఖమ్మం సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన ఆ కోర్టు.. జన్మించిన కుటుంబంలోని ఆస్తిలో వాటా ఉంటుందంటూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ నరసింహారావు సోదరుడు ఎ.నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ నగేశ్ భీమపాకలతో కూడిన ఫుల్‌బెంచ్ సుదీర్ఘంగా విచారించి ఇటీవల తీర్పు వెలువరించింది. ఒకసారి దత్తతకు వెళ్లినప్పుడు పుట్టిన కుటుంబంతో ఉన్న సంబంధాలన్నింటినీ వారు తెంచుకుంటారని, దత్తత తీసుకున్న కొత్త కుటుంబ బంధాలను పొందుతారని చట్టం చెబుతోందని తెలిపింది. పుట్టిన కుటుంబంతో ఎలాంటి సంబంధం లేనప్పుడు ఆస్తిలో హక్కు పొందజాలరని పేర్కొంది. కోల్‌కతాలోని 'దాయాభాగ', తెలుగు రాష్ట్రాల్లో మితాక్షర చట్టం ప్రకారం పుట్టిన వెంటనే ఉమ్మడి కుటుంబం ఆస్తిలో హక్కు పొందుతాడన్నప్పటికీ ప్రత్యేకంగా హక్కు పేర్కొనలేదంది. దీని ప్రకారం పూర్వీకుల ఆస్తిలో భాగం ఉంటుందని, అయితే పుట్టిన కుటుంబంలోని వారు సంపాదించిన ఆస్తిలో వాటా ఉండదని స్పష్టం చేసింది. యార్లగడ్డ నాయుడమ్మ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పు చట్టప్రకారం సరికాదదంది. మేన్స్ హిందూ చట్టం, ముల్లా సూత్రాలతోపాటు పట్నా, అలహాబాద్ హైకోర్టులు, సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకుని.. దత్తతకు ముందు వాటా కేటాయించకపోతే పుట్టిన కుటుంబ ఆస్తిలో హక్కు ఉండదంటూ 44 పేజీల తీర్పును తెలంగాణ హైకోర్టు వెలువరించింది.

# కాంగ్రెస్‌లో కొనసాగుతున్న చేరికల పర్వం

- రేవంత్ సమక్షంలో పెద్ద ఎత్తున చేరికలు

హైదరాబాద్ విశాలభారతి :ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తోంది. బీఆర్ఎస్, బీజేపీల నుంచి పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో చేరికలు కొనసాగుతున్నాయి. నేడు బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చొప్పదండి, వనపర్తి నియోజకవర్గాలకు చెందిన పలువురు చేరారు. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలానికి చెందిన పలువురు యువకులు చేరారు. బీఆర్ఎస్ నుంచి వనపర్తి నియోజకవర్గం ఘనపూర్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్ నివాసంలో కండువా కప్పి రేవంత్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

# సత్యవతికే మహబూబాబాద్ టికెట్..!

## ఇప్పటికే మంత్రికి అధిష్టానం సంకేతాలు

- కేసీఆర్ డిసైడ్ అయినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ
- సీఎం సంకేతాలతో దూకుడు పెంచిన సత్యవతి వర్గం
- డోర్నకల్ నుంచి కవితకే దాదాపు సీటు ఖరారు
- వివాదాల కారణంగా సిట్టింగ్ ఎమ్మెల్యేకు సీటు నిరాకరణ
- పార్టీ గెలుపే లక్ష్యంగా సాగుతున్న బీఆర్ఎస్ వ్యూహాలు



**తెలంగాణ బ్యూరోవిశాల భారతి:**అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్ది మహబూబాబాద్ రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఎన్నికలకు కేవలం నాలుగు నెలల సమయం మాత్రమే ఉండడంతో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం. ఇందులో భాగంగా ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న శంకర్ నాయక్ ను తప్పించి సౌమ్యురాలుగా పేరు తెచ్చుకున్న మంత్రి సత్యవతి రాథోడ్ కు మౌబాబూబాబాద్ టికెట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఒక అంచనాకొచ్చినట్టు సమాచారం. అదే సమాచారాన్ని మంత్రి సత్యవతి రాథోడ్ కు చేరవేసినట్టు విస్తృతంగా చర్చ జరుగుతోంది. స్థానిక ఎమ్మెల్యేగా శంకర్ నాయక్ రెండోసారి గెలిచిన అనంతరం ఆయనపై అనేక ఆరోపణలు రావడంతో అధిష్టానం ఈసారి మంత్రి సత్యవతి రాథోడ్ వైపు దృష్టిసారించినట్లు నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

**బీఆర్ఎస్ వర్గాల్లో విస్తృతంగా చర్చ**

మహబూబాబాద్ నుంచి మంత్రి సత్యవతి రాథోడ్ ను బరిలోకి దించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ డిసైడ్ అయినట్టు జిల్లా రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. ఈ విషయంలో అధిష్టానం ఇప్పటికే మంత్రికి సంకేతాలు ఇచ్చినట్లు లోకల్ బీఆర్ఎస్ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. మరోవైపు సీఎం ఇచ్చిన సంకేతాలతో మహబూబాబాద్ లో సత్యవతి దూకుడు పెంచారు. క్షేత్రస్థాయిలో శరవేగంగా పావులు కలుపుతున్నారు. పార్టీలో సౌమ్యురాలిగా పేరున్న మంత్రి సత్యవతికి టికెట్ ఇస్తే కచ్చితంగా గెలుస్తారని అధిష్టానికి నివేదికలు అందడంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. కేసీఆర్ మద్దతుతో బంజారా భవన్ ప్రారంభోత్సవం, గిరిజన రిజర్వేషన్, గిరిజన పోడు భూముల పట్టాల మంజూరీ తదితర విషయాల్లో తన మార్పును చూపించారు మంత్రి సత్యవతి. దశాబ్దాలుగా అణచివేతకు, వెనుకబాటుకు గురైన గిరిజనులు ఆత్మ గౌరవంతో బతికేలా చేసిన నాయకుడు, గిరిజన ఆరాధ్య దైవం సీఎం కేసీఆర్ పేరును ఇటీవల మంత్రి సత్యవతి కుడి చేతిపై పచ్చబొట్టు వేయించుకుని పార్టీ పట్ల తన విధేయతను చాటుకున్న విషయం తెలిసిందే.

**రెండింటిలో గెలుపే లక్ష్యంగా అడుగులు**

ఇదిలా ఉండగా.. డోర్నకల్ బరిలో ఎంపీ కవితను రంగంలోకి దించాలని అధిష్టానం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్టు భావిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యేకు అదే స్థాయిలో సముచిత గౌరవం ఇవ్వడానికి అధిష్టానం ఒక అంచనాకొచ్చి ఆయనను ఒప్పించాలని సీనియర్లను పురమాయించినట్టు సమాచారం. మరోవైపు మహబూబాబాద్ నియోజకవర్గంలో పార్టీ గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్ ముందుకు సాగుతోంది. ఒక వేళ మహబూబాబాద్ నుంచి మంత్రి సత్యవతి.. డోర్నకల్ నుంచి ఎంపీ కవితలను పోటీకి దించనున్నట్లు దాదాపుగా ఖరారైనట్టు తెలుస్తోంది.దీంతో రెండు నియోజకవర్గాలలో నేతలు, క్యాడర్ సమన్వయంతో పనిచేసి గెలుపు సాధిస్తారని వ్యూహాత్మకంగా సీఎం కేసీఆర్ పావులు కదుపుతున్నట్లు రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.

**కేటీఆర్ అసహనం అందుకేనా?**

తాజాగా గులాబి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సైతం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న శంకర్ పై అసహనం వ్యక్తం చేయడం మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. ఎమ్మెల్యే కేటీఆర్ కోపానికి గురికావడం వెనుక చాలా విషయాలు దాగున్నాయని నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. మీడియా ఎదుటే ఎమ్మెల్యేను కేటీఆర్ తోసిపారేయడం, చీదరించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. నియోజకవర్గ ప్రజల్లో.. జిల్లా నేతల్లో ఆయనపై ఉన్న ఫిర్యాదులే దీనికంతటికి కారణంగా భావిస్తున్నారు. గతంలో కవిత, సత్యవతి లతో బహిరంగంగానే శంకర్ నాయక్ గొడవలకు దిగడంపై గులాబీ అధిష్టానం సీరియస్‌గా ఉందన్న సంకేతాలను కేటీఆర్ ఇచ్చనట్టు తెలుస్తుందని పొలిటికల్ అనలిస్టులు చెబుతున్నారు.



### మచ్చలేని రాజకీయం సత్యవతి సొంతం

1984లో రాజకీయాల్లో ఉండటం, కింది స్థాయి నుంచి రాజకీయాల్లో ఎదగడం, 2006లో నర్సులపేట జెడ్పీటీసీగా పోటీ చేసి గెలిచి, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా అనేక సేవలు అందించారు. 16 ఏప్రిల్ 2019 న ఎమ్మెల్సీ గా ప్రమాణ స్వీకారం చేసిన ఆమెను 2019 సెప్టెంబర్ 8న ముఖ్యమంత్రి కెసీఆర్ తన రెండవ మంత్రివర్గంలో మంత్రిగా అవకాశం ఇచ్చారు. పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని, మంత్రి సత్యవతి నిలుపుకొని, తన పనితీరుతో మంచి మార్కులను సాధించారు. ఆమె పనితీరు, మచ్చలేని రాజకీయ రికార్డులను పరిశీలించిన అధిష్టానం మంత్రి సత్యవతి వైపే మొగ్గినట్లు.. ఆమెకే సీటును కేటాయించిన పక్షంలో విజయం సాధించడం సులువవుతుందని పార్టీ అధిష్టానం ఓ క్లారిటీకి వచ్చినట్లు సమాచారం.

**ఎమ్మెల్యే తీరుపై అనేక ఫిర్యాదులు**

మహబూబాబాద్ ఎమ్మెల్యే తీరు జిల్లాలో పార్టీకి డ్యామేజ్ చేస్తోందని అధిష్టానం దగ్గరకు చాలా ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ముఖ్యమంత్రి కేసిఆర్ కూడా ఆయనకు గతంలో క్లాస్ పీకాడు. హోలీ పండగ రోజు మద్యం బాటిళ్లతో చేసిన రచ్చ అప్పట్లో దుమారం రేపింది. ప్రజల కోసం, పార్టీకోసం పనిచేయాల్సిన నేతల మధ్య తీవ్ర విభేదాలు సృష్టించాడని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన వ్యవహార శైలి ఇప్పుడు మహబూబాబాద్ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో మహబూబాబాద్ కలెక్టర్ ఆఫీస్ లో జరిగిన ఎస్సారెస్పీ చిన్న నీటిపారుదల శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యవతిపై ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరు వివాదస్పదమైంది. ఈ విషయంలో కేసీఆర్ మందలించినట్లు అప్పట్లో వార్తలు హల్చల్ చేశాయి.

**సిట్టింగ్ పై బోలేడు వివాదాలు**

2017 హరితహారం ప్రోగ్రాంలో శంకర్ నాయక్, ఓ మహిళా కలెక్టర్ అని చూడకుండా ప్రీతీమీనా చేయి పట్టుకోవడంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. అప్పటి నుంచి ఆయన తీరుపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 2019 క్రిస్మస్ పండుగ సందర్భంగా దుస్తుల పంపిణీలో భాగంగా రెడ్డి, వెలమ కులాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారాన్నే రేపాయి. వారికి డబ్బుల బలుపు ఎక్కువ ఉంటుందంటూ కులాలలో చిచ్చుపెట్టి ఆయా కుల సంఘాల కోపానికి గురయ్యారు. పార్టీ అధిష్టానం మందలించడంతో బేషరతుగా వారికి క్షమాపణ చెప్పక తప్పలేదు. ఇలాంటి బోలేడు వివాదాలు సిట్టింగ్ ఎమ్మెల్యే చుట్టూ ఉన్నాయి.

**కేసీఆర్ పలుమార్లు సీరియస్**

సీఎం కెసిఆర్ సైతం శంకర్ నాయక్ తీరుపై పలుమార్లు సీరియస్ అవ్వడంతోపాటు అనేక సార్లు మందలించారు. అయినా తన తీరులో మాత్రం మార్పు రావడం లేదని జిల్లా నాయకులు విసుకుంటున్నారు. మంత్రులను లెక్కచేయక, అధికారులను లెక్కచేయక, పార్టీ నేతలతో సఖ్యతగా లేక తరచు ఏదో ఒక వివాదం కొనితెచ్చుకొని వార్తల్లో నిలుస్తున్నాడని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టను ప్రజల వద్ద చులకన చేసిందని, మళ్లీ శంకర్ నాయక్ కు టికెట్ ఇస్తే.. ఓడిపోవడం ఖాయమని సీఎంకు నివేదికలు అందినట్లు తెలుస్తోంది. ఇటీవల శతాబ్ది వేడుకల నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పై ప్రజలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తి చేశారు. అన్ని విషయాలను బేరీజు వేసిన ముఖ్యమంత్రి..మహబూబాబాద్ నుంచి మంత్రి సత్యవతిని ఎన్నికల బరిలో దించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్ లోకి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ..?

మొదటిపేజీ తరువాయి

ఆ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. పొంగులేటితో పాటు ఆయన అనుచరులు కాంగ్రెస్ లో చేరగా... మాజీ మంత్రి జూపల్లి కూడా త్వరలో మహబూబ్ నగర్ లో జరిగే బహిరంగ సభలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఈ క్రమంలో ఇవాళ మాజీ ఎంపీ, కాంగ్రెస్‌నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరికపై ఇరువురు నేతలు చర్చించినట్టు సమాచారం. రాజగోపాల్‌రెడ్డి తిరిగి సొంతగూటికి చేరుతారని కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పొంగులేటితో రాజగోపాల్‌రెడ్డి భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పటికే రాజగోపాల్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన విషయం తెలిసిందే.

**హస్తం గూటికి మరో ఐదుగురు బీఆర్ఎస్ నేతలు..!**

ఈ చేరికలలో భాగంగానే కొద్ది రోజుల క్రితం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన అన్న ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ద్వారా.. తిరిగి హస్తం పార్టీలోకి రావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రియాంక గాంధీని కలిసినప్పుడు కూడా రాజగోపాల్‌రెడ్డి ప్రస్తావన తీసుకురాగా రాష్ట్ర ఇంచార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో చర్చించాలని ఆమె సూచించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూడా ఏఐసీసీ పెద్దలను తరచూ కలుస్తున్నట్లు తెలుస్తోంది. నెలాఖరున సభలు నిర్వహించి చేరికలు పూర్తయితే పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం వస్తుందని, ఎన్నికల సమయానికి కొత్త చేరికలు క్యాడర్‌లో జోష్ నింపుతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



# నలుగురు ఐఏఎస్ ల బదిలీ..

- బల్దియాకు కొత్త బాస్
- త్వరలో మరిన్ని బదిలీలు

**హైదరాబాద్ విశాలభారతి :**రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటుంది. తాజాగా మంగళవారం నలుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఆబ్కారీ శాఖకి కొత్త కమిషనర్లు వచ్చారు. ప్రస్తుతం ఆర్థికశాఖ కార్యదర్శిగా ఉన్న రొనాల్డ్ రోస్‌ను.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. ఇప్పటివరకు కమిషనర్‌గా ఉన్న లోకేష్ కుమార్‌ను... రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారిగా ఈసీ నియమించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగణంగా లోకేష్‌కుమార్‌ను బదిలీ చేసిన సర్కార్... ఆయన స్థానంలో బల్దియా బాధ్యతలను రొనాల్డ్ రోస్‌కు అప్పగించింది. ఎక్సైజ్ శాఖ కమిషనర్‌గా ఉన్న...సర్ఫరాజ్ అహ్మద్‌ను రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారిగా ఈసీ నియమించింది. సర్ఫరాజ్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం వెయిటింగ్‌లో ఉన్న ముషారఫ్ అలీ ఫారుఖీని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

**త్వరలోనే మరిన్ని బదిలీలు :**

ఈ బదిలీలకు కొనసాగింపుగా మరిన్ని బదిలీలు జరిగే అవకాశం ఉంది. ఆర్థికశాఖ కార్యదర్శి, గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి, పురపాలక శాఖ సంచాలకుల పోస్టులకు అధికారులను నియమించాల్సి ఉంది. కొన్ని జిల్లాల్లో మూడేళ్లకు పైబడి కలెక్టర్లుగా కొనసాగుతున్న వారు ఉన్నారు. ఈసీ నిబంధనలకు లోబడి కొన్ని జిల్లాల కలెక్టర్లను బదిలీ చేయాల్సి ఉంది. కొందరు అధికారులు వెయిటింగ్లో ఉన్నారు. వారికి కూడా పోస్టింగులు ఇవ్వాల్సి ఉంది.

# ఎంబీబీఎస్ విద్యార్థులకు గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

ఆక్ట్, ఆర్టికల్ 371D నిబంధనలకు లోబడి అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేసింది. దీని ప్రకారం 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. అంతకు ముందు 85శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15శాతం అన్ రిజర్వుడుగా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. ఎంబిబిఎస్ సీట్లు పొందేవారు. తాజా నిర్ణయం వల్ల తెలంగాణ విద్యార్థులకు ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు దక్కనున్నాయి. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేర్చింది తెలంగాణ ప్రభుత్వం. నాడు తెలంగాణలో 2850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే, ఇప్పుడు 8340 సీట్లకు పెరిగింది.

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉన్న 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,895 సీట్లు ఉండేవి. ఇందులో 15శాతం అన్ రిజర్వుడు కోటాగా 280 సీట్లు కేటాయించాల్సి వచ్చేది. ఇందులో తెలంగాణ విద్యార్థులతో పాటు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు అవకాశం పొందేవారు. దీంతో తెలంగాణ విద్యార్థులు సీట్లు కోల్పోవాల్సి వచ్చేది. ఇదే విధానం కొనసాగితే, పెరిగిన మెడికల్ కాలేజీల్లో కూడా 15శాతం అన్ రిజర్వుడు కోటా అమలు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల మరిన్ని సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుంది. దీన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, అన్ రిజర్వుడు కోటాను కేవలం పాత 20 మెడికల్ కాలేజీలకు మాత్రమే పరిమితం చేస్తూ నిబంధనలకు సవరణ చేసింది. కొత్తగా వచ్చిన 36 మెడికల్ కాలేజీలకు ఆ నిబంధన వర్తించకుండా తాజా సవరణ చేసింది. దీంతో 520 మెడికల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకు అదనంగా లభిస్తున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ బి కేటగిరి సీట్లలో 85శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే చెందేలా లోకల్ రిజర్వ్ చేసుకోవడం వల్ల తెలంగాణ విద్యార్థులకు అదనంగా 1300 ఎంబీబీఎస్ సీట్లు పొందుతున్న విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ రెండు నిర్ణయాల వల్ల మొత్తం 1820 సీట్లు ప్రతి ఏటా దక్కనున్నాయి. 1820 సీట్లు అదనంగా అంటే దాదాపు 20 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు తో సమానం. ప్రతి ఏటా కాలేజీలు పెరిగినా కొద్ది ఈ సీట్ల మరింత పెరగనుంది. కొత్త మెడికల్ కాలేజీలలో అల్ ఇండియా కోట 15% సీట్లు యథాతదంగా ఉంటాయి. దీనిలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ తో సహా దేశంలో ఎక్కడివారైనా మెరిట్ ప్రకారం అడ్మిషన్ పొందవచ్చు.

# ప్రధాని మోడీ వరంగల్ షెడ్యూల్ ఖరారు

మొదటిపేజీ తరువాయి

బయల్దేరతారు. 10.35కి అక్కడి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 10.45 నుంచి 11.20 వరకు వరంగల్‌లో పలు ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారు. 11.30 నుంచి మధ్యాహ్నం 12.10 వరకు బహిరంగసభలో మోదీ ప్రసంగిస్తారు. అనంతరం 12.15కి వరంగల్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 1.10 గంటలకు హకీంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో రాజస్థాన్ పర్యటనకు ప్రధాని వెళ్లనున్నారు.

# ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలి

- సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు - ఆవునూరి మధు




**ఇల్లందు విశాలభారతి :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు పరకాల నాగన్న అన్నారు. ఇల్లందు పట్టణంలో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర మహాసభల సందర్భంగా ఇల్లందు పురవీధులలో యువకులు చేతిన బిగిపిడికిలి జెండా పట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగసభ నిర్వహించారు. పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏండ్లు గడిచిన నేటికి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు ఆత్మహత్యలే శరణమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన చేస్తూ నిరుద్యోగులను గోసపెడుతున్నారని, ఇచ్చిన నోటిఫికేషన్లకు పేపర్ రూపకల్పన జరగకముందే లికేజ్ కు పాల్పడుతున్నారని అన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీలు నీటిమీద బుడగలుగానే మారాయని మండిపడ్డారు. ప్రజా ఉద్యమ కారులపై నల్లచట్టాలను ప్రయోగించి నిత్యం నిర్బంధం కొనసాగిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం హరితహారం పేరిట తరతరాలుగా సాగుచేసుకుంటున్న పోడు భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టేపరిస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని అన్నారు. కేంద్రర రాష్ట్ర ప్రభుత్వాల ఆవలంబిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**పరకాల నాగన్న, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు**
కేంద్ర ప్రభుత్వం హిందూ మతోన్మాదంతో పాలన సాగిస్తూ ప్రజలను, యువతను మభ్యపెడుతున్నారని కార్పొరేట్ సంస్థలకు రాయితీలిచ్చి, ప్రజలపై పన్నులబారాన్ని మోపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను బడా పెట్టుబడిదారి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని తెలిపారు. చట్టసభల్లో నూతన చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకువస్తున్నారని, మోడీ, కేసీఆర్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) ఉద్యమిస్తూనే, సమాజంలో దోపిడీ, పీడన, అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కళారూపాల ద్వారా వేలాదిమంది యువతి, యువకులతో కోర్ట్ ఏరియా నుండి ప్రదర్శన ప్రారంభమై, కొత్త బస్టాండ్, జగదాంబ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించి గవర్నమెంట్ హాస్పిటల్ వరకు ప్రదర్శన కొనసాగింది.

**యాలీలో నల్గొండ నాగయ్య**
పి వై ఎల్ రాష్ట్ర మహాసభ సందర్భంగా జరిగిన ర్యాలీలో దివ్యాంగుడు అయిన నల్లగొండ నాగయ్య పి వై ఎల్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మొక్కువుని దీక్ష వలె తన వెహికల్ పై బిగిపిడికిలి జండా కట్టి అందరితో సమానంగా ర్యాలీలో భాగస్వామ్యం అయ్యాడు. తను నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఎంత దూరమైనా తన సొంత వాహనంపై వెళ్లి సభలో సమావేశాల్లో భాగస్వామ్యుడు అవుతాడు. అతని స్ఫూర్తితో యువత ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆలంబిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పలువురు ప్రశంసించారు.
బహిరంగ సభలో సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, పి వై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్, పి ఓ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు, పిడిఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మహేష్, సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, పి వై ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా లక్ష్మీ నారాయణ, కునుకుంట్ల సైదులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింత నర్సింహ రావు, పర్షిక రవి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ రాష్ట్ర నాయకులు గొర్రెపాటి రమేష్, పాపయ్య, డి.రవి, గణేష్, వివిధ జిల్లాల పి వై ఎల్ నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదిన వేడుకలు

**దేవరుప్పుల విశాలభారతి :** మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పుట్టినరోజు సందర్భంగా దేవరుప్పుల మండల కేంద్రంలో 'రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు' పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో మంత్రిగ సతీమణి, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషాదయాకర్ రావు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కేక్ కట్ చేసి,అందరికీ పంచారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనహృదయనేతగా దయన్న ప్రజల మనసులో ఉండడం పూర్వజన్మ సుకృతం అని.. దయన్న ప్రజల మనిషి అని..దానికి వారు చేస్తున్నటువంటి సేవలే నిదర్శనం అని.. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,ఎంపిపి బస్వ సావిత్రి మల్లేశం, జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి,దేవరుప్పుల గ్రామ సర్పంచ్ ఈడునూరి రమా నర్సింహారెడ్డి,యువజన నాయకులు వంగ అర్జున్,కోతి ప్రవీణ్,బబ్బురి శ్రీకాంత్ గౌడ్,ప్రధాన కార్యదర్శి చింత రవి,నాయకులు సోమనార్శయ్య,కొల్లూరి సోమయ్య,ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.



## దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ..

**దేవరుప్పుల విశాలభారతి :**దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో భూమి కోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ సాయుధపోరాట వీరుడు దొడ్డి కొమురయ్య.తుపాకీ తూటాలకు ఎదురునిలిచి వీరమరణం నేటికీ 77 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఆయన జయంతిని,వర్ధంతిని ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే ఆయన జయంతి వేడుకలను నిర్వహిస్తుండగా ప్రథమంగా ఈ సారి తెలంగాణ రాష్ట్ర మంతటా వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నది. ఆయన స్వస్థలం జనగామ జిల్లా,దేవరుప్పుల మండలం,కడవెండి గ్రామంలో దొడ్డి కొమురయ్య స్మారక స్థూపం ఉండగా అక్కడే దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని 'తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు' సౌజన్యంతో ఏర్పాటు చేయగా నేడు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు,సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,ప్రజా గాయకురాలు విమలక్క. పాల్గొన్న ఎంపిపి బస్వ సావిత్రి మల్లేశం,సర్పంచ్ బెల్లినా రెడ్డి,ఎంపిటిసి దుబ్బాక కవిత రత్నాకర్ రెడ్డి, నాయకులు, ప్రజలు, పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కేసిఆర్ తోనే జనరంజక పాలన

- బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకున్నాం
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి...



**బాల్కొండ విశాలభారతి:** ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన,బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల,తొర్తి గ్రామాల నుండి బీజేపీ,కాంగ్రెస్ నుండి సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.గుమ్మిర్యాల గ్రామ రైతుల కోసం ఎంతో చేశామని వారు అదే స్థాయిలో ఆదరించాలని అన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలకు కావాల్సిన పనులు చేస్తాం. ఓట్లు ఆశిస్తాం అని అన్నారు. ప్రజలు జరిగిన సదుపాయాలు గుర్తు చేసుకొని పని చేసిన వారికి మద్దతుగా నిలవాలన్నారు. గుమ్మిర్యాల,తొర్తి గ్రామాల నుంచి ఇంత పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరినందుకు మంత్రి సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన నలుగురు బిఆర్ఎస్ కార్యకర్తల కుటుంబ సభ్యులకు బీమా చెక్కులను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వేల్పూర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు.బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండలంకు చెందిన కీ.శే చిన్న మల్లయ్య సతీమణి పడిగే సవితకు, ఏర్గట్ల మండలం నాగేంద్ర నగర్ కు చెందిన కీ.శే శంకర్ భార్య గంగామణి కు, ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామానికి చెందిన కీ.శే ప్రశాంత్ భార్య దివ్యకు,కమ్మర్ పల్లి మండల కేంద్రానికి చెందిన కీ.శే అక్బర్ తండ్రి సయ్యద్ మహమ్మద్ లకు మంత్రి రెండు లక్షల చొప్పున 8 లక్షల చెక్ లను అందజేశారు.మంత్రి మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త ఇంటికి కేసీఆర్ పెద్ద దిక్కులా ఉంటారని మంత్రి స్పష్టం చేశారు.పార్టీ కి కార్యకర్తలే పునాది అన్న మంత్రి కార్యకర్తల కొసం బిఆర్ఎస్ పార్టీ కోట్ల రూపాయలను ఇన్సూరెన్స్ గా చెల్లిస్తుందన్నారు.కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించడం ద్వారా వాళ్ళ ఇంటికి పెద్ద దిక్కులా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలుస్తుండన్నారు.
ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాలకు చెందిన కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిదులు పాల్గోన్నారు.



## తెదేపా పూర్వ వైభవం కోసం నాయకులు కృషి చేయాలి

- తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్
- టిడిపి లో చేరిన మీర్పెట్ స్వతంత్ర కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్..

**హైదరాబాద్,విశాల భారతి:** తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం కోసం నాయకులు కార్యకర్తలు కంకణ బద్ధులై పనిచేయాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.
మంగళవారం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో..తెలుగుదేశం పార్టీలో చేరిన మిర్పేట్ స్వతంత్ర కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ చేరిక సందర్భంగా ఆయన మాట్లాడారు.. మల్లేష్ గతంలో ఈ పార్టీలో పనిచేసిన నాయకుడే నేడు స్వతంత్ర కార్పొరేట్ గా గెలిచి మళ్ళీ మాతృ సంస్థ అయిన తెలుగుదేశం పార్టీలో పనిచేసేందుకు వచ్చారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోనీ 119 నియోజక వర్గాల్లో పోటీచేస్తున్నమని..చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో నిలబడి గెలవాలన్నారు.
అనంతరం మల్లేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం కోసం నిరంతరం శ్రమిస్తూన్న.. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మాతృ పార్టీలో చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు టిడిపి బలోపేతం కోసం.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో పనిచేస్తానని పార్టీ అభ్యున్నతికి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేస్తానన్నారు. చేరిన వారిలో గంధం సత్యనారాయణ, బీజేవైఎం రంగారెడ్డి, రాజేష్ రెడ్డి, అసిఫ్, మీర్పేట్ కార్పొరేషన్ రజక సంఘం అధ్యక్షుడు విక్రాంత్, సాగర సంగం నాయకులు వాసు సాగర్, మున్నూరు కాపు సంఘం నాయకులు జానయ్య పటేల్, శెట్టి బలిజ కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్,ఈకార్యక్రమంలో.. జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్.. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిలి ఐలయ్య యాదవ్, చేవెళ్ల పార్లమెంటు అధ్యక్షులు సుభాష్ , ఎస్సీ సెల్ అధ్యక్షుడు అశోక్,, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు చేసే ప్రయత్నాలను తిప్పి కొట్టాలి

- సంఘాలను బలోపేతం కోసం కార్మికులు ఐక్యంగా ఉండాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్ రావు




**సూర్యాపేట విశాలభారతి :**కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి,వాటిని తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యంగా ఉండాలని ఏ ఐ టి యు సి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటియూసి ప్రాంతీయ అధ్యక్షుడు దంతాల రాంబాబు అధ్యక్షతన ఏఐటియూసి ప్రాంతీయ కౌన్సిల్ సమావేశం స్థానిక ధర్మభిక్షం భవన్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి సాధించిన 42 కార్మిక చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం సవరణల పేరుతో రద్దు చేసే ప్రయత్నం చేస్తుండగా సీఎం కేసీఆర్ దాన్ని సమర్ధిస్తున్నారని విమర్శించారు. రెండవ సారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఆర్టీసి సమన్వయ కమిటీల గుర్తింపు రద్దు చేసి ఎన్నికలు నిర్వహించకుండా అడ్డుకుంటే ఎన్నికల కొరకు హైకోర్టు వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేశారు.సింగరేణి కార్మికులకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులను నిర్వీర్యం చేసి కార్మికుల పొట్ట కొట్టేందుకు కార్మిక చట్టాలను రద్దు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలు, ఆదాని,అంబానీ సంస్థల బాగు కోసం కార్మిక చట్టాలను సవరణలు చేయడంతో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్ల వెంట తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటియూసి పోరాట ఫలితమే కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి అధ్యక్షులు దంతాల రాంబాబు,గౌరవ అధ్యక్షులు చామల అశోక్ కుమార్, సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి బోర వెంకటేశ్వర్లు,నియోజవర్గ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, దీకొండ శ్రీనివాస్,గాలి కృష్ణ,పెంద్ర కృష్ణ,రమేష్,తాళ్ల సైదులు ,హరి,ఎడెల్లి శ్రీకాంత్,జానయ్య,గోపి తదితరులు పాల్గొన్నారు.



## సేవా కార్యక్రమాలతో ముందుకు పోతా..

**-టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ ఎం హుస్సేన్ ముజీబ్..**

**హైదరాబాద్,విశాల భారతి:** పేద ప్రజల కోసం వివిధ సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తానని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ ఎం హుస్సేన్ ముజీబ్ అన్నారు. అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రెడ్డి హిల్స్లోని ఎంఎన్జె క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులు రోగి సహాయకులకు 600 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతినెల నాలుగుసార్లు పేదలకు తల్లిదండ్రుల పేరుమీద ఆసుపత్రిలో అన్నదానం చేయడం తన చాలా సంతృప్తి గా ఉందని తెలిపారు. పేదవారికి ఒక పూట భోజనం పెట్టడం దేవుడు తనకు ఇచ్చిన వరంగా భావిస్తానని సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, శంకర్, నరేష్ కుమార్, ఆస్పత్రి సభ్యులు శివకుమార్, అరుణ్ జ్యోతి, శేఖర్, రాజ్ కుమార్, సుదర్శన్, మహమ్మద్ అబ్దుల్, మహమ్మద్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మంచినీరు కరువాయే

- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందే విద్యార్థులు నీళ్లు లేక అవస్థలు
- మన ఊరు మనబడి క్రింద విడుదలైన 29 లక్షల 44 వేల రూపాయలు ఏమయ్యాయి...?
- సింగరేణి సిఎస్ఆర్ నిధుల క్రింద 50 లక్షలు విద్యార్థుల దాహార్తిని తీర్చేవేనా...?



**మణుగూరు విశాలభారతి :** పేరుగోప్ప ఊరు దిబ్బ అనే సామెత మణుగూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చూస్తే అర్థమవుతుంది. ఎన్నో లక్షల రూపాయలు మంజూరైన విద్యార్థుల దాహార్తిని తీర్చే నిధులు కరువయ్యాయి. సుమారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 570 మంది విద్యార్థులు నీళ్లు లేక అరిగోశ పడుతున్నారు. ఇది ఎక్కడో లేదు. స్వయానా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు క్యాంప్ ఆఫీస్ ముందున్న పాఠశాలలో జరగడం గమనార్హం. మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మన ఊరు మనబడి క్రింద 29 లక్షల 44 వేల రూపాయలు మంజూరు చేశారు. అయినా అవి విద్యార్థి దాహార్తిని తీర్చలేదు. మరి సింగరేణి సిఎస్ఆర్ నిధులనుండి సుమారు 50 లక్షల రూపాయలు మంజూరు చేశారు. అవి కూడా విద్యార్థి దాహార్తిని తీర్చలేదు. ప్రభుత్వ పాఠశాల ముందు ఎమ్మెల్యే ఉన్నారు. ఆయన కూడా విద్యార్థి దాహార్తిని తీర్చలేదు. మరి ఈ బాధను ఎవరికీ చెప్పుకునేది. విద్యాశాఖ అధికారులకు వచ్చిన నిధులన్నీ ఏమయ్యాయి. రాజకీయ నాయకులారా, అధికారులారా, మనకు మనమే సాటి. నిజాలు చెప్పడంలో వెనుకుంటాము, దోచుకోవడంలో ముందుంటాము. కానీ విద్యార్థుల కనీస అవసరాలైన దాహార్తిని తీర్చి ముందుకు వెళ్దాలి. ఇకనైనా ఈ విషయంపై స్పందించి సంబంధిత అధికారులు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దాహార్తిని తీర్చాలని పాఠశాల విద్యార్థులు వేడుకుంటున్నారు.




## వంద పడకల ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

- ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి,

**మణుగూరు విశాలభారతి :** మణుగూరు 100 పడకల హాస్పిటల్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ హాస్పిటల్ కాంట్రాక్టు వర్కర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మణుగూరు ప్రభుత్వ వంద పడకల హాస్పిటల్ లో స్వీపర్లు, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్లు గా 42 మంది కాంట్రాక్టు వర్కర్స్ విధులు నిర్వహిస్తున్నారని, వీరికి 2022 ఫిబ్రవరి నుండి నవంబర్ వరకు 10 నెలల వేతనాలు చెల్లించలేదని అన్నారు. వర్కర్స్ ప్రతినెలా వేతనాలు అడుగుతున్నప్పటికీ వచ్చేనెల ఇస్తాం, వచ్చేనెల ఇస్తామని మభ్యపెట్టి పది నెలల వేతనాలు చెల్లించలేదన్నారు. అసలే చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ కు ముల్గే నక్కపై తాటికాయ పడ్డ చందంగా 10 నెలల వేతనాలు చెల్లించకపోవడం వలన అప్పులు తెచ్చుకొని తిని పని చేసి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు.
అనంతరం పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని హాస్పటల్ సూపరింటెంట్ కు వినతి పత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు మణుగూరు ఏరియా నాయకులు ఎండి. గౌస్, ప్రభుత్వ హాస్పటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

**చిట్యాల విశాలభారతి :** భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిపిన వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య మరణం వృదా కాకుండా ఆ పోరాటానికి ఊపిరి పోసిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవి శెట్టి శంకరయ్య లు అన్నారు.చిట్యాల పట్టణ కేంద్రంలో మంగళ వారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో జరిపిన కా, దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దొరలకు,భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థ కు , వెట్టిచాకిరి కి వ్యతిరేకంగా జరిగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయబడిందని అన్నారు. కొమరయ్య బలిదానం తెలంగాణ ఉద్యమంలో నిప్పుల కొలిమి రాజేసి కమ్యూనిస్టు నాయకుల ఉద్యమాలకు, పోరాటాలకు ఊతమిచ్చిందని, దీంతో బాంచన్ అన్న బడుగు వర్గాల చేత బందూకులు పట్టించి , భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘనత, సాయుధ రైతాంగ పోరాటానికి ఉన్నదని, ప్రభుత్వం భూములు ప్రజలకు పంచటమే కొమురయ్య కు నిజమైన నివాళిలు అని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, రూరల్ మండల కార్యదర్శి అరూరి శ్రీను, మండల నాయకులు నారబోయిన శ్రీనివాసులు, కత్తుల లింగ స్వామి,రుద్రారపు పెద్దులు, శీలా రాజయ్య, ఐతరాజు నర్సింహా,అక్కెనపల్లి నాగయ్య, ఐతరాజు యాదయ్య,జిట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.




# బహుజన రాజ్యస్థాపన కోసం యువత ముందుండాలి

**మహబూబాబాద్ విశాలభారతి :** బహుజన రాజ్యస్థాపనకోసం యువత ముందుండాలని అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం ఆరెస్పి లక్ష్యం అని బిఎస్పీ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఐనాల పరశురాములు అన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ అసెంబ్లీ మరిపెడ మండలంలోని ఉల్లేపల్లి గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ గ్రామ జనరల్ బాడీ సమావేశం ఎడ్ల లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి బిఎస్పీ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఐనాల పరశురాములు ముఖ్యఅతిధిగా పాల్గోని ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి ఎనమిది దశాబ్దాలు పూర్తయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో కేవలం తక్కువ జనాభా కలిగిన బ్రాహ్మణులు రెడ్లు, కమ్మలు, వెలమ దొరలు మాత్రమే పదే పదే అధికారం మార్పిడి చేసుకొంటూ పాలిస్తున్నారని అధిక జనాభా కలిగిన బీసీ,ఎస్సీ,ఎస్టీ, మత మైనారిటీలు,అగ్రకుల పేదలకు ఓరిగింది సూన్యం అని, మళ్ళీ అధికార మార్పిడి కోసం రెడ్లు ఏకమవుచున్నారని స్థానిక ప్రజాప్రతినిధులను నడిపేది దొరలేనని వారి పాలనను పాతరేయుటకు బహుజనులు ఏకం కావాలని అన్నారు.డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలొ సబ్బండా జాతులు ఏకమై బహుజన రాజ్యం సాధించుకొని జనాభా ప్రాతిపధికన రాజ్యాధికారన్ని అనుభవించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిఎస్పీ మరిపెడ మండల అధ్యక్షులు జినక కృష్ణమూర్తి, గ్రామ నాయకులు మేడెబోయిన నాగరాజు యాదవ్, దుద్దిమెట్ల లింగన్న యాదవ్, గుమ్మడి శ్రీకాంత్, గోరెంట్ల పూర్ణచందర్, గుండ్ల శ్యాంసుందర్ పద్మశాలి, మంచ గణేష్ యాదవ్, ఊళ్లోజ్ మహేష్,నవీలే అప్పారావు, కంచనపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళ సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

**-మూడు మండలాల కాంగ్రెస్ మహిళ మండల అధ్యక్షులు నియామకం**

పాలకుర్తి విశాలభారతి : పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సి రెడ్డి ఆదేశాల ప్రకారం మంగళవారం పాలకుర్తి నియోజకవర్గం మూడు మండలాల మహిళ అధ్యక్షులను ప్రకటించారు. కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలిగా వడ్లకొండ తార, పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బండిపెల్లి మనెమ్మ, కొడకండ్ల మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలిగా అందే శ్రీవర్ణ, దేవరుప్పుల మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలిగా, బోగాల మాలతి , బ్లాక్ మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల మహిళా అధ్యక్షులను జనగామ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడిగే ఇందిరా నియమించారు. వీరిని నేడు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ విరి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. రాబోయే కాలంలో ఈ పాలకుర్తి గడ్డ మీద ఝాన్సి రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం అని అన్నారు. అలాగే ఎన్నికైన వారు మాట్లాడుతూ మమ్మలని నియమించిన ఝాన్సి రెడ్డి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితా రావు అలాగే మా నియామకానికి సహకరించిన కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు పెద్ది కృష్ణమూర్తి గౌడ్, కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నర్సయ్య, పెంటన్న, కరుపోతుల శ్రీనివాస్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జలగం కుమార్, పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్, పాలకుర్తి ఎస్సీ సెల్ అధ్యక్షులు గాదెపాక భాస్కర్, బిక్షపతి, ఎస్టీ సెల్ అధ్యక్షులు, భాస్కర్ నాయక్, సజ్జన్ నాయక్, బిసి సెల్ అధ్యక్షులు ఐలేశ్, పాలకుర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసు హరీష్, సేవాదళ్ నాయకులు ఆదినారాయణ, కొడకండ్ల పట్టణ అధ్యక్షులు రవీందర్, రఘవపురం సర్పంచ్ సోమా శ్రీను, బైరు భార్గవ్, మహేందర్ యావ, రెడ్డి రాజుల రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు గోనె మహేందర్ రెడ్డి దావెర అనిల్, శ్రీను నాయక్ మహేందర్ బొడ మహేందర్ రమేష్ నాయక్ అశోక్, శ్రీకాంత్ వివిధ మండలాల నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీరు బాటిల్ తో యువకుడు పై దాడి

- నగరంలో అర్ధరాత్రి వరకు నడుస్తున్న పబ్బులు.
- హ్యాపీ నెట్స్ పబ్బులతో మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ ఒకరికి గాయాలు.
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ మున్సిపల్ అధికారులు.



**నిజామాబాద్ బ్యూరో విశాల భారతి :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బా బైపాస్ రోడ్ లో గల బార్ అండ్ రెస్టారెంట్ మ్యూజికల్ పబ్ లో ఓ యువకుడు మరో యువ కుడిని బీర్బుడలతో దాడి పాల్పడినట్లు రూరల్ ఎస్సై లింబాద్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి కోటగల్లికి చెందిన సిద్ధార్థ గాజుల్పేట్ కు చెందిన రింకు లో అలియాస్ అభిషేక్ అనే యువకుడు దుబ్బ ప్రాంతంలోని హ్యాపీనైట్ బార్ అండ్ రెస్టారెంట్లు డాన్స్ చేస్తుండగా ఒకరి కాలు ఒకరికి తగిలింది. దీంతో ఇద్దరు యువకులు తీవ్ర గర్షణకు దారి తీసింది. మద్యం మత్తులో గాజుల్పేట్ కు చెందిన రింకు అలియాస్ అభిషేక్ అనే యువకుడు కోటపల్లికి చెందిన సిద్ధార్థ పై బీరు బాటిల్తో దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింబాద్రి. తెలిపారు అయితే హ్యాపీనైట్స్ బార్ అండ్ రెస్టారెంట్ తో ఏర్పాటు చేసిన పబ్బు అనుమతి లేదని, ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పబ్బును నిర్వహించడం అర్ధరాత్రి వరకు హైదరాబాద్ తరహా పబ్బులు నడపడం చూస్తుంటే ఎక్సైజ్, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది.

ఎక్సైజ్ అధికారులు, మున్సిపల్ అధికారుల అండదం డలతో నిజామాబాద్ లోని పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లు మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తున్నాయి. పెద్ద మొత్తంలో అధికారులకు ముడుపులు ముట్టడం, అధికార పార్టీ నాయకులను అండదండలు ఉండడంతో వాటి వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడనట్లు చూడడం లేదు. ఇటీవల పబ్బు యజమాని తమకు అన్ని అనుమతులు ఉన్నాయం టూ మీడియా సమావేశం ముందు తెలిపినప్పటికీ. అధికారులు ఆ పబ్బుకు సంబంధించిన అనుమతులు లేవని తెలపడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఉన్నత అధికారులు పట్టించుకోని సమయానికి, పబ్బులను మూసేలా చూడాలని ప్రజల్లో విజ్ఞప్తి చేస్తున్నారు.

# గత పాలకుల తప్పులను చెరిపేస్తూ నూతన రోడ్లు

**- పేద ప్రజలకు హామీ ఇచ్చి రోడ్లు పూర్తి చేయించిన మంత్రి**
**- స్వయంగా వెళ్లి పరిశీలించి ఇతర సమస్యలు తెలుసుకున్న మంత్రి జగదీష్ రెడ్డి**



**సూర్యాపేటవిశాలభారతి :** గత పాలకుల నిర్లక్ష్యానికి,నిరాధారణకు గురైన ఇందిరమ్మ కాలనీకి చెందిన పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిఅక్కున చేర్చుకున్నారు. కాలనీ ప్రజలు అడిగిందే తడవుగా రహదారులను నిర్మించి 15 సంవత్సరాల రోడ్ల సమస్యను పరిష్కారం చేశారు మంత్రి.ఇటివల ఓ కార్యక్రమానికి కాలనీకి వెళ్లిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డికి అక్కడి ప్రజలు తమ గోడును వెల్లబోసుకున్నారు. గత ప్రభుత్వాలు భూమి ఇచ్చారని ఇల్లు కట్టుకుంటే 15 ఏళ్లుగా ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఊరికి దూరంగా ఉంటూన్నామని కనీసం నడిచేందుకు రోడ్లు,మౌలిక వసతులు లేవని తమను పట్టించుకునే నాధుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో స్పందించిన మంత్రి జగదీష్ రెడ్డి పట్టణ ప్రాంతాలకు దీటుగా శివారు కాలనీలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని మీకు రోడ్లు వేయించి మీ బాధలు తొలగిస్తానని హామీ ఇచ్చి అధికారులకు పనులు పురమాయించారు.దీంతో అధికారులు ఆయా కాలనీలోని వీధులను కలుపుతూ రెండు వీధులకు సీసీ రోడ్లు నిర్మించారు. మంగళవారం ఆ రోడ్లను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పరిశీలించి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దీంతో అక్కడి ప్రజలు ఆనందానికి వదులు లేకుండా పోయాయి. 15 ఏళ్లుగా ఎవరు తమను పట్టించుకోలేదని విషయాన్ని మంత్రి జగదీష్ రెడ్డికి చెప్పిన వెంటనే రోడ్లు వేయించి మా ఇబ్బందులు తొలగించారని మంత్రి జగదీష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని మంత్రి జగదీష్ రెడ్డి ప్రజలను అడగీ తెలుసుకున్నారు. సదరు రోడ్లకు డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరగా డ్రైనేజ్ నిర్మాణం తో పాటు మరికొన్ని రోడ్లను కూడా వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతలపాటి భరత్ మహాజన్,మున్సిపల్ కమిషనర్ పి రామానుజుల రెడ్డి,ఈఈ జి కే డి ప్రసాద్,డి ఈ సత్య రావు, ఏఈ సుమంత్,పెద్దగట్టు మాజీ చైర్మన్ మద్ది శ్రీనివాస్ యాదవ్,తొమ్మిదవ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షుడు గుండాగాని నాగభూషణం,ఉపాధ్యక్షుడు మద్దూరి కుమార్,ప్రధాన కార్యదర్శి దంతాల సాయి ప్రణయ్, యూత్ అధ్యక్షుడు మచ్చ రాము, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు దుర్గయ్య,బి ఆర్ ఎస్ పార్టీ కమిటీ సభ్యులు డెవలప్మెంట్ కమిటీ సభ్యులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయంచాలి

**నడిగూడెం - విశాలభారతి :**



దళితులకు గత 20 యేండ్ల క్రితం ప్రభుత్వం ఇండ్ల స్థలాలను మంజూరి చేసి పెట్టాలిచ్చిందని ఇప్పుడు ఆ ఆ స్థలాలను ప్రస్తుత ప్రభుత్వం దళితుల నుంచి లాక్కోవాలని చూస్తుందని మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు నెమ్మది సురేష్ అన్నారు. మండలంలోని తెల్లబెల్లి గ్రామంలో దళితులకు ఇచ్చిన ఇంటి స్థలాలను స్వాధీన పరసుకునేందుకు వచ్చిన అధికారులను దళితులు అడ్డుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి స్థలాలకు పట్టా హక్కులు ఉన్న భూమికి వెంటనే ఇళ్ళు మంజూరు చేసి నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఇరవై సంవత్సరాల క్రితం సర్వే నెంబర్ 69 గల భూమిని అప్పటి ప్రభుత్వం మాకు పట్టాలు ఇచ్చారని తెలిపారు.ఇప్పుడు వాటిని స్వాధీన పరచుకోవడం సోషనీయమన్నారు. ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి పంపిణీ చేస్తామని ఎన్నికల్లో హామి ఇచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం మూడు ఎకరాలు ఇవ్వకపోగా ఇచ్చిన ఇంటి స్థలాలను లాక్కుంటుందని వాపోయారు. కుటుంబాలు పెరుగు తున్న నేపథ్యంలో ఉన్న ఒకే ఇంట్లో ఉండాలంటే ఇబ్బంది కలుగుతున్నదని వెంటనే ఇండ్లు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంటి స్థలాల పోరాట కమిటీ నాయకులు నెమ్మది మేరీ. మేడి చిట్టెమ్మ పులి సుజాత. కందుకూరి ప్రమీల..నెమ్మాది వెంకటమ్మ పులి రాణి పోలంపల్లి సాయమ్మ చేకూరి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.....

# అల్లూరి ఆశయాలు కొనసాగిస్తాం

**- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం కనకా రెడ్డి**



**దేవరుప్పుల విశాలభారతి :** భారత విప్లవకారుడు స్వతంత్ర ఉద్యమంలో ముఖ్యమైన పాత్ర పోషించిన అల్లూరి సీతారామరాజు 125 జయంతి సందర్భంగా సింగరాజుపల్లి లో గల విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కనకా రెడ్డి మాట్లాడుతూ భారతదేశము నుండి బ్రిటిష్ వలస పాలకులు పోవాలని నా దేశంలో పేదరికం నిరుద్యోగం నిరక్షరాస్యత పోవాలని దేశ సంపద ప్రజలకు అందాలని తన జీవితాన్ని బ్రిటిష్ పాలన వ్యతిరేకంగా పోరాటం చేసి త్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. కానీ నేటి పాలకులు స్వతంత్ర ఉద్యమ పోరాటయోధుల త్యాగాలను మర్చిపోయి ఓట్లు వేసిన ప్రజలను మర్చిపోయి దేశాన్ని దోసుకుంటున్న శక్తులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను దోచిపెడుతూ నిరక్షరాస్యత నిరుద్యోగం పేదరికం పెంచి పోషిస్తున్నారు ఇలాంటి పాలకులను దేశంలో రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని రాబోయే ఎన్నికల్లో ఈ ప్రజా వ్యతిరేక పాలకులని ఇంటికి పంపించాలని ప్రజల్ని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రాపర్తి రాజు సింగార రమేష్ ఈ అహల్య బి. గోపి జె. ప్రకాష్ ఎస్ విజేందర్ చందు నాయక్ నాగరాజ్ సురేష్నాయక్ లింగం రజిత వరలక్ష్మి ఎం భవాని ధనమ్మ శంకరయ్య దేవదానం వెంకటరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# పేదల అభ్యున్నతికి వంగవీటి రంగా కృషి

**కోదాడ విశాలభారతి:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరంతరం పేదల అభ్యున్నతి కొరకు కృషిచేసిన వంగవీటి మోహన్ రంగ ఆశయాలను యువత సాధించాలని పలువురు కాపు సంఘం నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని రాజీవ్ చౌక్ సెంటర్లో ఆయన 76వ జయంతి సందర్భంగా మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షులు సన్నీరు మురళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మిక, కర్షక, అణగారిన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు నిరంతరం పోరాడిన మంచి మనసు ఉన్న నేత వంగవీటి రంగా అని ఆయన భౌతికంగా మన మధ్య లేక పోయినా కాపు జాతి ఐక్యత కొరకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. కాపు కులంలో పెద్ద నాయకుడిగా ఎదిగి రాష్ట్ర స్థాయిలో కాపు కులానికి పేరు తెచ్చారని పలువురు పేర్కొన్నారు. అనంతరం వారి జయంతి సందర్భంగా 50 కేజీల భారీ కేక్ కట్ చేసి పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారితో పాటు సినీ నటుడు ఎస్వీ రంగారావు జయంతిని నిర్వహించారు. పట్టణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ సర్పంచ్ పారా సీతయ్య, కాపు సంఘం పట్టణ అధ్యక్షులు సన్నీరు మురళి, తోట శ్రీను, చిన్న, పసుపులేటి బుజ్జి, చాప గోవిందు, ఆరె నవీన్, చందు, సాయి, జగదీష్, ఆవులు గోపి, పారా వెంకటేశ్వర్లు, చింతపండు సత్యం, పసుపులేటి నరసింహారావు, శంకర్ శెట్టి కోటేశ్వరావు, మిర్యాల నాగేశ్వరావు, ధూళిపూడి మోహన్, కంబాల నరేష్, కంబాల ప్రసాద్, చందు, సాయి, జగదీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివి

- **మణుగూరు ఆర్యవైశ్య ఆధ్వర్యంలో బాలవెలుగుకు చేయూత**

**మణుగూరు విశాలభారతి :** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్యవైశ్యుల ముద్దు బిడ్డ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా మంగళవారం మణుగూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముత్యాలమ్మ నగర్ లోని బాల వెలుగుకు చేయూతనిచ్చారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేసి 25 కేజీ ల బియ్యం, దుస్తులు అందజేశారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆర్థిక శాఖ మంత్రిగా, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టి ఎనలేని కృషి చేశారని అన్నారు. 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తికి భారత రత్న ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల ప్రెసిడెంట్ కొత్తగుండ్ల రామచందర్ రావు టౌన్ ప్రెసిడెంట్ విశ్వనాథ్ గుప్తా మహిళా సంఘం ప్రెసిడెంట్ చిత్తలూరు ఉమా కిరాణా మర్చంట్స్ ప్రెసిడెంట్ దోసపాటి నాగేశ్వరరావు, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ శేషుబాబు సిహెచ్ శేషుబాబు, వనితా క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ నాగరత్నమణి, వాసవి క్లబ్ కే సీ జీ ఎఫ్ఇం చార్జ్ బండారు నరసింహారావు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కొత్త ఇందుమతి, వాసవి క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ కృష్ణమూర్తి, కే కృష్ణమూర్తి, స్వరాజ్యం, శ్రీరామ్ స్వర్ణలత, బండారు మానస, ధనలక్ష్మి పాల్గొన్నారు.



# విప్లవ వీరుడు అల్లూరికి ఎమ్మెల్యే 'గూడెం' ఘన నివాళి

**పటాన్ చెరు, విశాలభారతి :** మన్యం వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకొని పటాన్ చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం 27 ఏళ్ల వయస్సులో తనకున్న పరిమిత వనరులతో ఆంగ్లేయుల సైన్యాన్ని గడగడలాడించి ప్రతి ఒక్కరిలో దేశభక్తిని నింపిన మహోన్నత విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అల్లూరి బతికినన్ని రోజులు స్వతంత్ర భారతావని కోసం పరితపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# పుట్టిన రోజు శుభాకాంక్షలు పాండు..

- మంత్రి హరీష్ రావు ఆశీస్సులు తీసుకున్న పాండురంగా రెడ్డి
- ఘనంగా 'టీపీఆర్' జన్మదిన వేడుకలు

**పటాన్ చెరు, విశాలభారతి :** అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తన జన్మదినం సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు పాండురంగారెడ్డిని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఐదు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని, ప్రజల మన్ననులు పొందేలా పనులు చేయాలని చైర్మన్ పాండురంగారెడ్డిని మంత్రి హరీష్ రావు శుభాశీస్సులు అందజేశారు. జన్మదినం సందర్భంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డితో పాటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాండురంగా రెడ్డిని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టిఆర్ఎస్ శ్రేణులు, కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య కేకులు కట్ చేసి పాండురంగా రెడ్డి ఘనంగా, ఆనందోత్సహాలతో తన జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహాయ సహకారాలతో అమీన్ పూర్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో తీసుకుని వెళ్తానని తెలిపారు.

## 'టీపీఆర్'కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన 'జీఎంఎస్ఆర్'



**పటాన్ చెరు, విశాలభారతి :** అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డికు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అమీన్ పూర్ పరిధి లోని పాండురంగారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో గూడెం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పాండురంగారెడ్డికి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యూసుఫ్ అలీ, బీఆర్ఎస్ పటాన్ చెరు పట్టణ అధ్యక్షుడు ఎండి.అఫ్జల్ అలీ, కొండా లక్ష్మణ్, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



# 13న పటాన్ చెరులో బోనాల పండుగ

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, విశాలభారతి:** ఆషాడ మాసంలో నిర్వహించే బోనాలను పటాన్ చెరు పట్టణంలో ఈనెల 13వ తేదీన నిర్వహించేందుకు పట్టణ పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బోనాల పండుగ ఏర్పాట్లపై మంగళవారం ఉదయం పటాన్ చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామ స్వామి దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన పట్టణ పుర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత రెండు సంవత్సరాలుగా ఆదివారం, సోమవారం నిర్వహిస్తున్న పండుగను పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు ఒకే రోజున నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 13వ తేదీన నిర్వహించనున్న బోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వం తరఫున అన్ని దేవాలయాల వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జెడ్పిటిసి జైపాల్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, పట్టణ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలు



**భద్రాచలం విశాలభారతి :** భద్రాచలం స్థానిక రాజుపేట కాలనీ లో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను మార్కాపురం సీతారాములు ధన పాల కుమార్ మరియు విశాల భారతి రిపోర్టర్ గడ్డం సుధాకర్ రావు పలక ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు మిఠాయిలు పంచారు. ఈ జయంతి వేడుకలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఈస్ట్ ఇండియా కంపెనీ పేరుతో మన దేశం వచ్చి వ్యాపారం చేసుకున్న బ్రిటిష్ దొరలు మన దేశానికి అప్పులిచ్చి దేశాన్ని ఆక్రమించారని వారన్నారు. సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని భారత దేశంలో వ్యాప్తి చేశారని భారతీయులను చిత్రహింసలు చేశారని అందులో భాగంగా ఫిఫ్త్ షెడ్యూల్ అయిన ఏజెన్సీ ప్రాంతం ఆదివాసుల పైన మేకల పుల్లరి భూమి పైన చేస్తూ పండించిన పంట పైన పెత్తందారితనం మహిళల పైన అరాచకాలు అడవి దుంపలు పండ్లు, కాయలు పోడు భూముల పైన బ్రిటిష్ దొరల ఆగడాలకు అంతులేకుండా పోయిందని అడవి బిడ్డల పైన. ఎనలేని ఆంక్షలు పెడుతున్న తరుణంలో ఆకుపసరులు మూలికలతో వైద్యం చేస్తున్న అల్లూరి సీతారామరాజు గిరిజనులను చిత్రహింసలు పెడుతున్న తీరును చూసి చలించిపోయారు ఆదివాసులను ఒక్కటి కమ్మని పిలుపునిచ్చారు ఆదివాసులతో దళాలను ఏర్పాటు చేసి రంపచోడవరం రాజవొమ్మంగి అడ్డతీగల తదితర పోలీస్ స్టేషన్ల పై దాడి చేసి తుపాకులు స్వాధీనం చేసుకొని ఒక లేఖను వదిలి వెళ్ళే వారని ఇట్లు అల్లూరి సీతారామరాజు అని సంతకం చేసి పోలీస్ స్టేషన్లో పెట్టి వెళ్లేవారు అని అట్లా ఆదివాసీల తిరుగుబాటు మల్లు దొర గండం దొర వంటి ఆదివాసి ఉద్యమకారులు అనేకమంది అల్లూరి సీతారామరాజు తలపెట్టిన ఉద్యమానికి వెన్ను దన్నుగా నిలిచారని మన్యం తిరుగుబాటు భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందని వారు కొనియాడారు. బ్రిటిష్ దొర అయినటువంటి రూథర్ఫోర్డ్ అల్లూరి సీతారామరాజుని మట్టు పెట్టాలని పథకం బన్నీ ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్తాం అని నమ్మించి సంధి కాని పిలిచి తుపాకులతో కాల్చి చంపారని వందేమాతరం అంటూ అల్లూరి సీతారామరాజు నేల కొరిగారని వారన్నారు. అల్లూరి సీతారామరాజు మరణం దేశవ్యాప్తంగా మరింత ఉద్యమాన్ని రాజేసిందని బ్రిటిష్ దొరల ను తరిమికొట్టే దాంట్లో మన్యం తిరుగుబాటు ప్రధాన ఘట్టంగా చరిత్ర పుట్టల్లో చెరగని ముద్ర వేసుకుందని వారన్నారు ఈ వేడుకల్లో ఆదివాసి మహిళా నాయకురాలు కంగాల రమణకుమారి. వావ్ సంస్థ సభ్యురాలు చంద్రుగొండ అరుణ మంద కిరణ్ మొల్లేటి రాంప్రసాద్ స్కూల్ ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొన్నారు.



## తెలంగాణ తొలి అమరవీరుడు

# దొడ్డి కొమరయ్య

**నూతనకల్ విశాలభారతి :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య 77వ వర్ధంతిని నూతనకల్లు మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తొట్ల మల్సూర్ స్మారక భవనం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట తొలి యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బొజ్జ శ్రీను ,కూసు సైదులు, ,మందడి చంద్రారెడ్డి ,బాణాల మధుసూదన్ రెడ్డి ,బొజ్జ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# డీల్ కుదిరింది..?

- బాల్కొండకు సునీల్... ఆర్మూర్‌కు అనిల్
- అధిష్టానం ముందు చర్చలు కొలిక్కి
- పద్మశాలి బీసీ బిడ్డకు టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం నిర్ణయం
- బాల్కొండ వేదిక కరెక్టు కాదని యోచన..
- ఆర్మూర్ నుంచి బరిలోకి దింపేందుకు రేవంత్ మంతనాలు..
- ఇక్కడ పద్మశాలీల సంఖ్య... అధికారపార్టీపై వ్యతిరేకత... కాంగ్రెస్ ఊపు... ఆర్మూర్‌లో అనిల్ గెలుపుకు దోహదం చేస్తుందని అంచనా.




**నిజామాబాద్ బ్యూరో విశారభారతి :** రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మలుపుతిరు గుతున్నాయి. మొన్నటి వరకు బీజేపీ కోసం కొట్టాడుతుకున్న ఆశావహులు.. ఇప్పుడు కాంగ్రెస్ ముందు క్యూ కట్టారు. కానీ కాంగ్రెస్ అధిష్టానం గతంలో లాగా ఎవరిని పడితే వారిని తీసుకుని .. టికెట్ ఇస్తామనే హామీలు చేయడం లేదు. వారి హవా కొనసాగుతుందనే ధీమాలో ఉన్నారు. అదే సమయంలో మరింత అప్రమత్తతో ఉన్నారు. దీంతో పార్టీనే అంటిపెట్టుకుని ఉన్న నేతలకు కూడా ప్రయార్టీ ఇస్తున్నారు. ఇప్పుడు పార్టీ పరపతి పెరిగిందని పోలోమంటు వస్తున్న ప్రతీ ఒక్కరికి రెడ్ కార్పెట్ కప్పడం లేదు. అన్ని కోణాల్లో ఆలోచిస్తున్నారు. బాల్కొండ నుంచి సునీల్ బీజేపీ తరుపున పోటీ చేయాలనుకున్నా అక్కడ పప్పులు ఉడకలేవు. దీంతో కాంగ్రెస్‌తో కాళ్లబేరానికి వచ్చాడు. అయినా వారు వెంటనే ఓకే చెప్పలేదు. చివరకు అక్కడ అనిల్ అనే అభ్యర్థిని ఎటూకాకుండా చేసి మధ్యలో వచ్చిన సునీల్‌ను ఎంటర్‌టైన్ చేయడం కరెక్ట్ కాదనుకున్నారు. దీంతో సునీల్‌కు, అనిల్‌కు మధ్య అధిష్టానం మధ్యవర్తిత్వం కుదిర్చి డీల్ ఓకే చేసింది. దాదాపు ఐదు కోట్ల వరకు అనిల్‌కు సునీల్ సమర్పించు కున్నాడనే ప్రచారం ఉంది. దీంతో పాటు పార్టీ ఫండ్ కింద మరిన్ని కోట్లు కాంగ్రెస్ ఖాతాలో వేసుకున్నట్టు తెలుస్తోంది. ఇది సర్వత్రా మామూలే. షరా అంతటా జరిగేదే. దీంతో ఇకపై ఈరవిత్రి అనిల్ ఆర్మూర్ వేదికగా పోరాడనున్నాడు. ఇక్కడ జీవన్‌రెడ్డిపై ఉన్న వ్యతిరేకత, కాంగ్రెస్ ఊపు.. పద్మశాలి ఓట్లు అన్ని కలిసి బీసీ కార్డు మీద గెలుస్తాననే ధీమాతో ఇటు అభ్యర్థి అటు అధిష్టానం ఉంది.

# నిజామాబాద్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సంచలన తీర్పు

**హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు**

**నిజామాబాద్ బ్యూరో విశాలభారతి :** ఇందుర్ నగరంలోని ధర్మపురి హిల్స్ కు చెందిన షేక్ జుబేర్ ను హత్య చేసిన నిందితులు షేక్ ఫరీద్ అలియాస్ అబ్బాస్, సులేమాన్ ఖాన్ లకు జీవిత కాల కారాగార శిక్ష విధిస్తూ.. నిజామాబాద్ సెషన్స్ న్యాయమూర్తి సునీత కుంచాల మంగళవారం తీర్పును వెలువ రించారు. ధర్మపురి హిల్స్ లో నివాసం ఉండే ఫరీద్, జుబేర్ సారంగపూర్ లోని ఇజాజ్ బీరువాల దుకాణంలో కార్మికులుగా పని చేసే వారు. అక్కడ జుబేర్ చీటికీ, మాటికి తనను అవమానించేవాడని, సెల్ ఫోన్ దొంగిలించాడని ప్రచారం చేసి తనను మరింత అవమానించారని ఫరీద్, జుబేర్ పై కక్ష పెంచు



తులపై అభియోగాలు నిరూపితమైనందున షేక్ ఫరీద్ అలియాస్అబ్బాస్, సులేమాన్ ఖాన్ లకు జీవిత కాల కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సునీత కుంచాల తుది తీర్పును వెలువరించారు.

# బిజెపి ప్రభుత్వం ఏర్పడటం ఖాయం

**కిషన్ రెడ్డి, ఈటలకి శుభాకాంక్షలు తెలిపిన అశోక్**



**చిట్యాల విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షులుగా నియమితులైన గంగాపురం కిషన్ రెడ్డికి, తెలంగాణ బిజెపి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ గా నియమితులైన శ్రీ ఈటెల రాజేందర్ కి బిజెపి సీనియర్ నాయకులు చికిలంమెట్ల అశోక్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. దేశం కోసం, ధర్మం కోసం, పేదల రాజ్యం కోసం, రామ రాజ్యం కోసం పోరాడుతున్న భారతీయ జనతా పార్టీ ఈ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- యస్.పి అపూర్వ రావు
- సైబర్ నేరగాళ్లు పంపిన లింక్ లను క్లిక్ చేసి మోసపోవద్దు
- సైబర్ నేరగాళ్ల చేతిలో పోగొట్టుకున్న 19 లక్షల రూపాయలు రికవరీ



**నల్లగొండ విశాలభారతి :** ఆన్ లైన్ మార్కెటింగ్ ప్రొడక్ట్స్ లలో తక్కువ పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక మొత్తంలో డబ్బు పొందవచ్చు అని ఆశ చూపించే మోసపూరితమైన సైబర్ నేరగాళ్లు పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా యస్.పి అపూర్వ రావు ఒక ప్రకటనలో తెలిపారు. కనగల్ మండల కేంద్రానికి చెందిన గొట్టిగోర్ల అవినాష్ కి వాట్స్ అప్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు ఆన్ లైన్ మార్కెటింగ్ ప్రొడక్ట్ అని మెసేజ్ పంపించి తక్కువ పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక మొత్తంలో లాభాలు వస్తాయి అని మభ్య పెట్టగా మొదటగా 50 వేల రూపాయల పెట్టుబడి పెట్టగా కొన్ని ప్రొడక్ట్స్ పంపగా వాటిని విక్రయించాడు. దానికి కొంత ఎక్కువ డబ్బులు ఇచ్చి ఆశ చూపించి ఎక్కువ డబ్బులు పెట్టే విధంగా నమ్మకం కలగజేయగా అతను ఇలా మొత్తం 50 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టడం జరిగింది. అతని యాప్ లో 90 లక్షలు రూపాయలు కనిపిస్తున్నాయి కానీ వాటిని డ్రా చేయడానికి వీలు కాకుండా ఉండగా మోసపోయామని గమనించి సదరు వ్యక్తి వెంటేనే సైబర్ క్రైమ్ పోలీసులు పిర్యాదు చేయగా యస్.పి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసి సైబర్ నేరగాని యొక్క అకౌంట్ ను ఫ్రిజ్ చేసి 19 లక్షల రూపాయలను రికవరీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యస్.పి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు,మెసేజ్ లు క్లిక్ చేయకూడని, నకిలీ వెబ్ సైట్ల ద్వారా అమాయకులను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు లాగేస్తున్నారు. అంతే కాకుండా వైద్య సహాయం,పేరు పొందిన కంపెనీలలో ఉద్యోగాల పేరుతో సులభంగా నమ్మే మోసాలను ఎంచుకొని మోసాలు చేస్తున్నారు అని, లోన్ యాప్ అంటూ సులభంగా లోన్ లు ఇస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తూ మీ యొక్క డేటా మొత్తం తమ అధీనం లోకి తీసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారు, కాబట్టి ఎవరు అలాంటి యాప్ లను డౌన్లోడ్ చేయకూడద అని, ఎవరైనా ఇలాంటి మోసాలకు గురి అయితే వెంటెనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని లేని యెడల హెల్ప్ లైన్ నంబర్ 1930 కానీ 155260 కి కాల్ చేసి తెలియజేయాలని అన్నారు.


**సైబర్ నేరగాళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

సైబర్ నేరగాళ్లు చెప్పే మాటలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మకూడదు. సెల్ ఫోన్లు కు వచ్చే కేవైసి అప్డేట్ మెసేజ్లు,బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని చెప్పే మాటలు నమ్మకూడదు.బహుమతులు వస్తాయంటు పంపే లింకులు క్లిక్ చేయకూడదు. సోషల్ మీడియా వేదికగా ఎవరికి బ్యాంకు యొక్క ఖాతా, ఏటీఎం కార్డు వివరాలు ఓటిపి లు తెలియ చేయ కూడదు. ఈ సందర్భంగా టెక్నాలజీ ఉపయోగించిన రికవరీ చేసిన సైబర్ క్రైమ్ యస్.ఐ వీర శేఖర్, కానిస్టేబుల్ మొక్షిద్ లను జిల్లా యస్.పి అభినందించారు.

## అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



**చర్ల విశాల భారతి :** చర్ల మండలం లోని సత్యన్నారాయణ పురం గ్రామంలో అల్లూరి సీతారామ రాజు 126 వ జయంతి సందర్భంగా మంగళ వారం భారతీయ జనతా పార్టీ ఆద్వర్యం లో ఆయన విగ్రహానికి పులమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు..ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ మన్యం వీరుడు,పోరాటయోధుడు,విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలను గడగడలాడించి ప్రాణ త్యాగం చేసిన తీరు ప్రతీ ఒక్కరు గుర్తు చేసుకోవాలన్నారు. దేశభక్తి విషయంలో ప్రతీ ఒక్కరు అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.. భద్రాచలం నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ బిట్రగుంట క్రాంతి కుమార్,అల్ప కాలిక విస్తారిక్ చిక్కం మోహిని, మండల అధ్యక్షులు నక్కా కన్నా రావు,ముత్తారం రత్తయ్య, ఎడవల్లి శేషగిరి రావు,కార్యదర్శి ఆలెం సమ్మయ్య కుమార్,ల శ్రీధర్, పాల్గొన్నారు.



# డిఎం అండ్ హెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**బాల్కొండ విశాలభారతి:** బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిని డిఎం అండ్ హెచ్ఓ సుదర్శనం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా ల్యాబ్ ను సందర్శించారు.ఆసుపత్రిలో కలియతిరిగి అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రి లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఆస్పత్రి వైద్యులు అనిల్ కుమార్,శృతి, శ్రీకాంత్, డిఎం యచ్ ఓ.సిసి మధుకర్,ల్యాబ్ సూపర్వైజర్ లావణ్య,ల్యాబ్ టెక్నీషియన్ వీరయ్య గౌడ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టాల పంపిణీతో పోడు భూములపై
# ఇక గిరిజనులకే యాజమాన్య హక్కు




- గిరిపుత్రుల అస్తిత్వం,గౌరవానికి ఇది ప్రతీక
- భావితరాల జీవనోపాధికీ భద్రత కల్పించిన ఘనత కేసీఆర్ సర్కార్ దే..
- తండాలలో తీజ్ భవన్ ల ఏర్పాటుకై సీఎం కేసీఆర్ కు విన్నవిస్తా
- కలెక్టర్ తో కలిసి 1007 మందికి పట్టాలు అందజేత
- తాళ్ళపల్లిలో పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి

**బాల్కొండ - విశాలభారతి:**

పోడు భూములకు పట్టా పాస్ బుక్కుల పంపిణీతో ఇకపై గిరిజనులకే పోడు భూములపై పూర్తి హక్కులు లభించాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.మండలంలో రూ.2.25 కోట్లతో భీమ్‌గల్ నుండి ముచ్కూర్ వరకు బీ.టీ రోడ్(వయా పు రానిపేట్, పల్లికొండ) పునరుద్ధరణ పనులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం పు రాణీపేట్,పల్లికొండ గ్రామాలలో శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా స్థానికులు విన్నవించిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు.అనంతరం తాళ్ళపల్లి గ్రామంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దేవక్కపేట్,దేవన్ పల్లి,కారేపల్లి,కుప్కాల్, మెండోరా,రహత్ నగ ర్,సికింద్రాపూర్,తాళ్ళపల్లి గ్రామాలకు చెందిన అర్హులైన 1007 గిరిజన కుటుంబాలకు పోడు భూముల పట్టా పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంతో అడవి బిడ్డలకు భరోసా ఏర్పడిందని,వారి భావితరాల జీవనోపాధికి కూడా భద్రత లభించిందని మంత్రి తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కలిగిన ఆనందం తరహాలోనే ప్రస్తుతం గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం ఎంతో సంతోషం కలి గించిందన్నారు.ఇది వరకెన్నడూ లేని విధంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1,50,000 మందికి నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు అందిస్తోందని వివరించారు.ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలో 4300 మందికి 8600 ఎకరాల భూములు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.బాల్కొండ నియోజకవర్గంలోనే 1478 మందికి సుమారు రూ.400 కోట్ల విలువ చేసే 4000 ఎకరాల పోడు భూముల పంపిణీ జరుగు తోందన్నారు.

దీనికి అదనంగా ఇటీవలే మండలంలోని దేవ క్కపేట్,కారేపల్లి గ్రామాల్లో 1700 పైచిలుకు ఎకరాల అసైన్డ్ భూమిని సైతం లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.పోడు భూములపై హక్కులు కల్పించిన నేపథ్యంలో గిరిజనులు ఇకపై చెట్ల నరికివేతకు స్వస్తి పలకాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు. అడవుల సంరక్షణ ధ్యేయంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.పచ్చదనం పెరిగితేనే ప్రకృతి అనుకూలించి వర్షాలు సమృ ద్ధిగా కురుస్తాయని తద్వారా సమృద్ధిగా పంటలు పండించుకోగలుగుతామని అన్నారు.గిరిజను లు ఎంతో ఇష్టంగా జరుపుకునే తీజ్ వేడుకను దృష్టిలో పెట్టుకొని ప్రతి తండాలో తీజ్ భవన్ ఏర్పాటు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్ కు విన్నవిస్తానని హామీ ఇచ్చారు.గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు.తండాలకు గ్రామ పంచా యతీల హోదా కల్పించడంతో గిరిజనులకు స్థానిక సంస్థల్లో స్వయంపాలన దక్కిందని గుర్తు చేశారు. మారుమూల అటవీ ప్రాంతాల్లోని తండాలకు సైతం రోడ్లు,విద్యుత్, తాగునీటి వసతి వంటి సదు పాయాల కల్పన కోసం ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలను వెచ్చిస్తోందని అన్నారు.తాటిపల్లి నుండి మ్రిమడ్ల రోడ్డు నిర్మాణానికి అనేక అవాం తరాలు ఎదురైనప్పటికీ,వాటిని అధిగమిస్తూ ము ఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో బీటీ రోడ్డును మంజూరు చేయించానని తెలిపారు. రహత్ నగర్ నుంచి కారేపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి ప్రకటిం చారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 4300 మందికి 8600 ఎకరాల పోడు భూముల పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్ తదితర వివరాలను సేకరించి ప్రస్తుత సీజన్ నుండే వారి ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు.ఇందులో భాగంగా భీమ్‌గల్ మండల రైతాంగానికి కోటి 38 లక్షల రూపాయల రైతుబంధు పెట్టుబడి జమ అయ్యిందని వివరిం చారు.సాంకేతికంగా నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి దేవక్కపేట్,మానాల ప్రాంత రైతులకు సంబంధించిన పోడు భూముల పట్టాలను కూడా మరో రెండు మూడు రోజుల్లో పంపిణీ చేస్తామని తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ క్షేత్రస్థాయిలో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీ లించిన మీదటే అర్హులైన వారికి పోడు పట్టాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు.పర్యావరణ పరి రక్షణలో భాగంగా ప్రభుత్వం హరితహారం కా ర్యక్రమానికి విస్తృత ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. అడవిని తల్లిగా భావించే గిరిజనులు చెట్లు నరకడానికి స్వస్తి చెప్పి,అటవీ ప్రాంతాన్ని సంరక్షిం చాలని కోరారు.పట్టాలు అందుకున్న రైతులు పోడు భూముల్లో ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకోవచ్చని భరోసా కల్పించారు. వారి భూములకు సాగునీటి వసతి కల్పన కోసం జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో నిజా మాబాద్ ఆర్డీఓ రవి,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగురావ్,ఎంపీపీ మహేష్,జెడ్పీటీసీ చౌట్ పల్లి రవి,రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు శర్మ నాయక్, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రునాయక్,జెడ్పి కో ఆప్షన్ మొయిజ్,సర్పంచ్ చంద్రకళ,స్థానిక ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు,పెద్ద సంఖ్యలో గిరిజనులు, లబ్ధిదారు లు తదితరులు పాల్గొన్నారు.



## ఎదుగుదలను ఓర్వలేకనే అధికార పార్టీ నేతలు కక్ష సాధింపు



**మేడిపల్లి విశాలభారతి:** తన భర్త రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే మా కుటుంబంపై పోలీసులు, అధికార పార్టీ నేతలు కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతు న్నారని బోడుప్పల్ మాజీ సర్పంచ్ తోటకూర లక్ష్మీ యాదవ్ అన్నారు. మంగళవారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 85 లో తము కొనుగోలు చేసిన పట్టా భూమిపై అధికార పార్టీ నేతలు, పోలీసులు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు మంగళవారం నాడు తమ భూమి వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో తన భర్త టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తో కలిసి మాట్లాడుతూ బో డుప్పల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 85 లో తన గంగాదేవి బుచ్చయ్య పన్నాల జనార్థన్ రెడ్డి, బుచ్చిరెడ్డిల వద్ద 2000 సంవ త్సరంలో మూడు ఎకరాల ఇరవై గుంటల భూమిని కొనుగోలు చేసేందుకు అగ్రిమెంట్ చేసుకుని 2008 లో రిజిస్ట్రేషన్ చేసు కున్నారని సదరు భూమి 2010 లో మోటేషన్ అయ్యిందని తెలిపారు. తన తండ్రి మరణించిన అనంతరం తన పేరునా రిజిస్ట్రేషన్ చేసుకొని పాస్ పుస్తకా లు తీసుకున్నానని తెలంగాణ ఏర్పాటు అయ్యాక వచ్చిన తెలంగాణ పట్టా దారు పాస్ పుస్తకం కూడా వచ్చిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు కూడా తన ఖాతాలో జమా అవుతుందని పేర్కొన్నారు.గతంలో కూడా ఇలానే తమ భూమిలో మా ప్లాట్లు ఉన్నాయని కొందరు దౌర్జన్యానికి దిగితే మాకు భూమి అమ్మిన వారు కేసు పెట్టడంతో విచారణ జరిపిన పోలీసులు పక్క భూమి జీపీఏ తీసుకున్న నరసింహ అనే వ్యక్తి జీపీఏ తీసుకున్న దానికంటే అదనంగా భూమి లే అవుట్ చేసి ప్లాట్లు విక్రయించినట్లు విచారణలో తేలడంతో జీపీఏ చేసిన వ్యక్తిపై చీటింగ్ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని తెలిపారు.ఇలాంటి వివాదమే 2019 లో వచ్చిందని అప్పుడు ఓ దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన మేడ్చల్ కలెక్టర్ మేడిపల్లి తహసీల్దారు తో విచారణ జరిపి తమ భూమి వ్యవసాయ భూమియేనని తేల్చి చెప్పారని అన్నారు.

**తన భర్త రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే మల్లారెడ్డి కుట్రలు...**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న తన భర్త తోటకూర వజ్రేష్ యాదవ్ బీఆర్ఎ స్ సర్కార్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తుంటే ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటూ ఇలాంటి చర్యలకు పాల్పడితున్నారని వా పోయారు.ఈ రోజు సంఘటనపై న్యాయ స్థానాన్ని ఆశ్రయించి తమపై అనుచితంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు వచ్చేలా పోరాడుతామని అన్నారు.

## 1/70 యాక్ట్ ను అపహస్యం చేస్తున్న అధికారులు

- ఆగ్రహం వ్యక్తం చేసిన జాతీయ గిరిజన అభ్యుదయ వాద సంఘం నేతలు
- వోల్టా, పీస గిరిజన చట్టాలను అపహస్యం చేస్తే సహించేది లేదు



**భద్రాచలం విశాలభారతి :** భద్రాచలం పట్టణంలో ఎక్కడ చూసినా బహుళ అంత స్తుల నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి ఏ అధికారులు ద్వారా ఇండ్లు గాని షాపింగ్ కాంప్లెక్స్ గాని లాడ్జిలు గాని ఎటువంటి అనుమతుల ద్వారా నిర్మిస్తున్నారు ప్రభుత్వ అధికారులు చెప్పాలని జాతీయ గిరిజన అభ్యుదయ వాద సంఘం గిరిజన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సందర్భం గా భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నందు ఏర్పాటుచేసిన కార్యకర్తల తసమావేశంలో ప్రతి ఆదివాసి బిడ్డ గిరిజన చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత తమ మీదే ఉందని లేకపోతే రానున్న రోజుల్లో ఇక్కడ గిరిజనులకు బతికే అవకాశం ఉండదని గిరిజన చట్టాలకు తూట్లు పొడిచి రాజకీయ అండదండలతో భద్రాచలం పట్టణంలో అక్రమ భవన నిర్మాణాలు చేప డుతున్న గిరిజనేతరులుపై ప్రభుత్వ పరమైన చర్యలు కనుక తీసుకోకపోతే ఆదివాసి బిడ్డల మనుగడ అగమ్యగోచరంగా మారుతుంద ని తెలిపారు 1/70 పిసా ,వోల్టా ,చట్టాలను ఉల్లంఘించిన వారిపైప్రభుత్వ అధికారులకు తెలిపే విధంగా ప్రతి ఆదివాసి బిడ్డ ఫిర్యాదు ద్వారా సంబంధిత ఐటిడిఏ అధికారి, జిల్లా కలెక్టర్ ఆర్డిఓ ,ఎమ్మార్వో, లకు లిఖితపూర్వ కంగా ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జాతీయ గిరిజన అభ్యు దయ వాద సంఘం నేతలు మర్మంచిట్టిబా బు,ఇర్పా శ్రీను, కల్లూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపు**



**సూర్యాపేట విశాలభారతి :**
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పైన ఉద్యమాలు ఉధృతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమా లవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరి నుండి విముక్తి కోసం నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని హిందూ ముస్లిం ఘర్షణ లుగా చూసే మతోన్మాదుల కుట్రలను తిప్పి కొ ట్టాలని అన్నారు. కడవెండి గ్రామంలో జరిగిన భూస్వాములు జాగిరిదారుల ధమన కాండను ఎదిరించి పోరాటం చేశాడని అన్నారు. ఆనాటి జాగిరిదారులు జమీందారుల పెత్తనంలో ఇబ్బం దులు పడటం కన్నా ప్రాణాలు పణంగా పెట్టి తమ జీవితాలను కాపాడుకోవడం కోసం ఉద్యమాలు నిర్వహించారని అన్నారు.దొడ్డి కొమరయ్య తొలి అమరత్వంతో పది లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. గ్రామ స్వ రాజ్యం కావాలని ఆనాడు ఎందరో పోరాట యోధులు ప్రజల్ని చైతన్యం చేస్తూ ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. ఆనాటి పోరాట స్ఫూర్తి తో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన ఉద్యమాలు తీవ్రతరం చేయాలన్నా రు నయా భూస్వాములు పెట్టుబడిదారులు నేడు ప్రజలను దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఆనాడు భూమి పేదలకు పంపిణీ చేయాలని పోరాటం చేస్తే నూతన తెలంగాణ రాష్ట్రంలో పంపిణీ చేసిన భూములను కాపాడుకోవడం కోసం పోరాటాలు చేయాల్సి రావడం సిగ్గుచేటు అన్నారు.పేదల ఇల్లు ,ఇళ్ల స్థలాలు మిగులు భూముల పంపిణీ కోసం దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో ప్రజలను సమీకరించి ఉద్యమాలు ఉధృతం చేయాలని పి లుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కా ర్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు,కోట గోపి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెం కన్న,జె.నరసింహ రావు,మేకనబోయిన శేఖర్,కొ ప్పుల రజిత, వీరబోయిన రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు ,సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రాంబాబు,రైతు సంఘం జిల్లా నాయకులు వజ్జె శ్రీను,సిఐటియు జిల్లా నాయకులు మామిడి సుందరయ్య,చిత్రం భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మామిడి నాగయ్య మరణం పార్టీకి తీరనిలోటు

**బెల్లంకొండ సత్యనారాయణ.. సిపిఎం మండల కార్యదర్శి.**

**నడిగూడెం విశాలభారతి :**
బృందావన పురం గ్రామానికి చెందిన ఎర్ర జెండా ముద్దుబిడ్డ సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ మామిడి నాగయ్య 88 మరణం పార్టీకి తీరని లోటు అని సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనా రాయణ అన్నారు. మండలంలోని బృం దావనపురం గ్రామంలో మంగళవారం నాగయ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. మామిడి నాగయ్య అంతిమయాత్ర లో పాల్గొని అయన మాట్లా డుతూ సుదీర్ఘకాలం సిపిఎం పార్టీ సీనియర్ నాయకుడిగా నిజాయితీగా ఉంటూ పేద ప్రజల పక్షాన సిపిఎం నాయకుడిగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాడన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన ఎర్రజెండాని వదిలిపెట్టకుండా పార్టీ కొరకు పనిచేసిన మంచి నాయకుడు అన్నారు. అంతిమయా త్రలో గ్రామ సర్పంచి బెల్లంకొండ హనుమ య్య , పార్టీ నాయకులు కోరుట్ల శ్రీనివాస్, బొడ్డు వెంకటనారాయణ, కాసాని కిషోర్, ముసుగు వీరస్వామి, శాఖా కార్యదర్శులు కాసాని రాంబాబు, కొండూరు యాలాద్రి, బొల్లి ఎంకన్న, సాలయ్య, మామిడి కృష్ణ, వెంకన్న, కుటుంబ సభ్యులు బంధువులు పార్టీ సానుభూతిపరులు గ్రామస్తులు తది తరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ, హరిత హారంతోనే సాధ్యం

**వడ్త్య దేవేందర్ నాయక్**



**దేవరకొండ విశాలభారతి :**పర్యావరణ పరిర క్షణ, సుస్థిర అభివృద్ధి హరిత హారంతోనే సాధ్యం అని దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్ అన్నారు. దేవరకొండ పట్టణం లో 3వ వార్డు పరిధిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన హరిత హారం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషన ర్ వెంకటయ్య, వైస్ చైర్మన్ రహమత్ ఆలీ లతో కలిసి దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్ పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ హరిత హారం కార్యక్రమం పర్యావరణ పరిరక్ష ణకు, స్థిరమైన అభివృద్ధి కలిగి ఉన్న ఒక గొప్ప కార్యక్రమమని అన్నారు. మనందరికీ తెలిసిన ట్లుగా పర్యావరణం జీవకోటికి అత్యంత విలువైన ఆస్తి దానిని సంరక్షించి రాబోయే తరాలకు అందించడం మనందరి బాధ్యతని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో హరితహారం కార్యక్రమం అడవుల పెంపకాన్ని ప్రోత్సహించడం, పచ్చదనా న్ని సృష్టించడంతో పాటు రాష్ట్ర అటవీ విస్తీర్ణాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకొని బీఆర్ఎస్ ప్రభు త్వం పని చేస్తుందని అన్నారు. ఈ హరిత హారం కార్యక్రమంతో ఎన్నో సామాజిక ప్రయోజనాలు ఉన్నాయని గుర్తు చేశారు. పర్యావరణ సమతు ల్యతను కాపాడుతు మన సమాజానికి అనేక ప్రయోజనాలనుఅందించడంలో అడవులు కీలక పాత్ర పోషిస్తాయని అవి కార్బన్ సింక్‌లుగా పని చేస్తాయి. గ్రీన్‌హౌస్ వాయువులను గ్రహిస్తాయి. అదే విధంగా వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గిస్తాయి. అడవులు జీవవైవిధ్యాన్ని సంరక్షించ డంలో, వృక్షజాలం, జంతుజాలానికి ఆవాసాన్ని అందించడంలో కూడా అడవులు సహాయ పడతా యని అన్నారు. తెలంగాణలో అటవీ విస్తీర్ణాన్ని ప్ర స్తుతం ఉన్న 24% నుండి 33%కి పెంచడం లక్ష్యం గా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యం రాష్ట్ర పౌరుల ఆరోగ్యకర మైన భవిష్యత్తు పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తుందని అన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ నీ కీర్తించారు. సామాజిక ప్రయోజనం కలిగిన ఈ హరిత యజ్ఞంలో మన వంతుగా ఐక్యంగా చేయి చేయి కలుపుదాం, చెట్లు నాటుదాం, రాబోయే తరాలకు స్థిరమైన వా రసత్వాన్ని సృష్టించేందుకు కలిసి పని చేద్దామని జాతికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవ రకొండ పట్టణ కౌన్సిలర్లు రయిస్, పొన్నబోయిన భూదేవీ సైదులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, పర్యావరణ ప్రియులు, స్వచ్ఛంద కార్యకర్తలు, ము న్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**రామన్నపేట విశాలభారతి :**
భారతీయ జనతా పార్టీ రామన్నపేట మండల శాఖ ఆధ్వర్యంలో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జీఆర్ ఎం ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహిం చడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం భాస్కర్, ఇంఛార్జి మైత్రి గౌడ లు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా మైత్రి గౌడ మాట్లాడు తూ నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల సేవ సుపరి పాలన పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలకు వివరించాలని సూచించారు. బిజెపి గెలుపే లక్ష్యంగా కార్య కర్తలు పనిచేయాలనిపిలుపునిచ్చారు
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య మండల అధ్యక్షులు తాటిపాముల శివకృష్ణ గౌడ్ జిల్లా కార్యదర్శి గర్దాసు సురేష్ అసెంబ్లీ కన్వీనర్ మహిళా నరసింహ అసెంబ్లీ కో కన్వీనర్ మాదూరి ప్రభాకర్ రావు వనం అంజయ్య పల్లపు దు ర్గయ్య యువమోర్చా అధ్యక్షులు మండల ప్రధాన కార్యదర్శులు శానగొండ మల్లికా ర్జున చారి యాదాసు లక్ష్మణ్ విమర్శ మండల అధ్యక్షులు అక్కెనపల్లి సైదులు రాపూర్ నరేష్ చిక్క బాబురావు రాజన్న రమేష్ పాల్గొన్నారు.



# పట్టణాలకు దీటుగా పల్లెల ప్రగతి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఘనపూర్ గ్రామంలో రూ. కోటి 10 లక్షల
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**పటాన్ చెరువిశాలభారతి :** పటాన్ చెరు నియోజకవర్గంలో పట్టణాలకు దీటుగా పల్లెలను ప్రగతి పథంలో తీసుకెళ్తున్నట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు మండలం ఘనపూర్ గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న గ్రామపంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, 17 లక్షల రూపాయలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో ఎమ్మెల్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హాయంలో తీవ్ర నిర్లక్ష్యానికి, అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేడు సీఎం కెసిఆర్ దూర దృష్టితో ప్రతి గ్రామం అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ, కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించడంతో పాటు ప్రతి కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపొందించడానికి ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీల తో పాటు ట్రాక్టర్లు సైతం అందించడం జరిగిందని తెలిపారు. ప్రజలు అభివృద్ధిలో భాగస్వామ్యం అయినప్పుడే అభివృద్ధికి సార్థకత చేకూరుతుందని అన్నారు. ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కావ్య కాశిరెడ్డి, ఎంపీటీసీ నీనా చంద్రశేఖర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బాసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# పివైఎల్ రాష్ట్ర మహాసభలకు బయలుదేరిన జిల్లా ప్రతినిధులు

**నిజామాబాద్ బ్యూరో విశాలభారతి :** ఖమ్మం జిల్లా ఇల్లెందు లో జరగనున్న 8 వ పి వై ఎల్ రాష్ట్ర మహాసభల కు జిల్లా నుండి ప్రతినిధులు బయలుదేరినట్లు మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి వనమాల సత్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన అన్నారు .స్వదేశీ పేరుతో మోడీ ఇంటికో ఉద్యోగం అంటూ కేసిఆర్ యువతను మోసం చేశారని ఆయన అన్నారు. మోడీ కేసీఆర్ లు అప్పులు కుప్పలుగా చేసి, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని ఆయన అన్నారు.
యువశక్తిని మద్యం మత్తులో, బూతు, అశ్లీల సాహిత్యం తో బంధిస్తున్నారని వారు అన్నారు. ఉద్యమిస్తే నిర్బంధిస్తున్నారని, కెసిఆర్ తెలంగాణ ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీలు నీళ్ల మూటలుగా మారాయని, కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలపై ధ్వజ మెత్తారు. మంగళవారం ఇల్లందు పట్టణంలో మహాసభల సందర్భంగా భారీ ప్రదర్శన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.
"దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్" అనే విషయాన్ని పాలకులు విస్మరించారని ఆయన అన్నారు. కుల,మతాల విద్వేషాలను మోడీ, సర్కార్ రెచ్చగొట్టి, లౌకిక విలువలను పాతరేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అన్నారు. శ్రమ దోపిడీ లేని సమరాజ్యం కోసం పి వై ఎల్ పోరాడుతుందని వారు తెలిపారు. సామ్రాజ్యవాద వ్యతిరేకత నిజమైన దేశభక్తి అని ఆయన అన్నారు.అమరవీరులకు జోహార్లను అర్పించారు.పివైఎల్ జిల్లా నాయకులు నరసయ్య, శ్రీనివాస్, గంగా దాస్, కత్తుల సాయన్న, సాగర్, వెంకటేష్, సంజీవ్, గంగారాం. గంగాధర్, పనాలి తదితరులు పాల్గొన్నారు.



# నకిరేకల్ లో ఎగిరేది బీఎస్పీ జెండానే

**నార్కట్ పల్లి విశాలభారతి :** నకిరేకల్ లో గెలిచేది బిఎస్పి పార్టీ ఏనుగు గుర్తే అని జిల్లా ఇంచార్జి లు ఆదిమల్ల గోవర్ధన్, పంబాల అనిల్ అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండలాల పర్యటనలో భాగంగా మంగళవారం నార్కట్ పల్లి, కట్టంగూర్ మండల బి ఎస్ పి పార్టీ రివ్యూ మీటింగ్ నార్కట్ పల్లి వాసవి భవన్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు పాల్గొని రివ్యూ నిర్వహించి మాట్లాడుతూ అధికారంలో ఉన్నటువంటి బిఆర్ఎస్ ప్రభుత్వం అరాచకాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపి బహుజన రాజ్యాం సాధించుకోవాల్సిన అవరసం ఎంతో ఉందని, ప్రజల పక్షాన కోట్లాడే డా. ప్రవీణ్ కుమార్ తన ఉన్నతమైనటువంటి పదవిని వదిలి ప్రజా జీవితంలో కి వచ్చి ప్రజల పక్షాన కో ట్లాడు తున్నారని బహుజన పార్టీ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరు పనిచేయాలని తెలిపారు. ఖచ్చితంగా నకిరేకల్ లో ఎగిరేధి బీఎస్పీ జెండా నే అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధక్షులు కోడి భీమ్ ప్రసాద్, జిల్లా మైనార్టీ కన్వీనర్ పాషా బాయ్, జిల్లా ఈసి మెంబెర్ గ్యార మారయ్య, నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని, నియోజకవర్గ అధ్యక్షులు గద్దపాటి రమేష్, నార్కట్ పల్లి మండల అధ్యక్షులు చెరుకుపల్లి శాంతి కుమార్, కట్టాంగూర్ మండల ఉపాధ్యక్షులు ఏరు వెంకన్న నార్కట్ పల్లి, కట్టాంగూర్ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య సేవలు మరువలేనివి

**వరంగల్ విశాలభారతి :**



తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య తొలి అమరుడని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంట కండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు తెలంగాణ అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి వేడుకలు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంట కండ్ల జగదీశ్ రెడ్డి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన మరణంతో ప్రజా చైతన్యానికి నాంది పలికిన మహనీయుడు కొమురయ్య అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఏనాడు తెలంగాణ త్యాగధనులను లేకుండా చూడాలని 60 సంవత్సరాలు మన వాళ్ళను మరుగున పడవేశారని అలాగే రైతు సాయుధ పోరాట యోధులను స్మరించలేదని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించుకున్న తర్వాత మహనీయులందరినీ గౌరవించుకుంటున్నామని దీనిలో భాగంగానే దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా జరుపుకుంటున్నామని మంత్రి తెలిపారు. కొమురయ్య మరణానికి ఒక ప్రత్యేకత ఉందని మొదటగా గ్రంథాలయాల ఏర్పాటు ఉద్యమం లా మొదలుపెట్టి ప్రజలను చైతన్యపరిచి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎదిరించే విదంగా ప్రజలను చైతన్యపరిచారని అన్నారు.దొరలు భూస్వాముల దౌర్జన్యానికి ఎదురు నిలిచి తన ప్రాణాలర్పించారని తన మరణం తరువాత ఉద్యమకారులు ఆయుధాలు పట్టడం మొదలుపెట్టారని ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి దీటుగా మనం కూడా ఆయుధాలు చేపట్టాలని పిలుపునిచ్చి నాయకత్వం వహించింది మన బి.యన్.రెడ్డి గారే నని మంత్రి గుర్తు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడివెల్లి గ్రామంలో ఒక సాధారణ కురుమ కులానికి చెందిన గొర్రెల కాపరుల కుటుంబంలో జన్మించిన కొమరయ్య ఒక మహోన్నత ఉద్యమానికి ఆద్యుడు అవడం తెలంగాణ ప్రజలకు గర్వ కారణం అని మంత్రి అన్నారు.తన 19 సంవత్సరాల వయసులోనే దొడ్డి కొమరయ్య భయపడకుండా ప్రజలను సమీకరించి ర్యాలీగా ముందు వరుసలో నడుస్తూ వస్తుండగా జరిపిన కాల్పులలో కొమురయ్య తన ప్రాణాలను విడిచారని మంత్రి అన్నారు. ఆయన స్ఫూర్తితోనే బాంచన్ దోర నుండి ప్రజలు బయటకు వచ్చారని ఆయన చిందించిన రక్తం వల్లనే తెలంగాణ సిద్ధించిందని మంత్రి అన్నారు.ఆయనను స్మరించటం, యోధులను తలచుకుంటూ,వారి త్యాగాలను తెలుపుతూ,దొడ్డి కొమరయ్య గురించి భావితరాలకు తెలపాలని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ జడ్పిటిసి జీడి బిక్షం,మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్,ఇన్చార్జిటీఆర్ఓ రాజేంద్రకుమార్ డి ఆర్ డి ఓ కిరణ్ కుమార్,జడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీఎఫ్ఓ సతీష్ కుమార్ సి పి ఓ వెంకటేశ్వర్లు,బీసీ సంఘ నాయకులు వసంత సత్యనారాయణ పిల్లే, జీవన్ కేశవ్,రాపర్తి శీను,వెంకట్ అధికారులు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# ఉర్దూ మీడియం స్కూల్స్ పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలి

**మైనార్టీ జిల్లా అధ్యక్షులు యాకూబ్ పాషా**

**భద్రాద్రి కొత్తగూడెం విశాల భారతి :** జిల్లాలో నడుస్తున్న ఉర్దూ మీడియం స్కూల్స్ పై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా అన్నారు. మంగళవారం స్థానిక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో యాకూబ్ పాషా మాట్లాడుతూ జిల్లాలో ఇల్లందు,కొత్తగూడెం,పాత పాల్వంచలలో ఉర్దూ మీడియం మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు గత కొన్నేళ్ళుగా నడుస్తున్నాయని, ఈ పాఠశాలల్లో నేటి వరకు ప్రాదమికోన్నత పాఠశాలలుగా అప్ గ్రేడ్ చెయ్యలేదని దీని కారణంగా ఉర్దూ మీడియంలో విద్యనభ్యసించిన విద్యార్థులు తెలుగు మీడియం,ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చేరుతున్నారని అన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలో పుస్తకాలు కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సరఫరా చేయటం లేదని, రాష్ట్ర వ్యాప్తంగా 1221 ప్రాధమిక,240 ఉన్నత పాఠశాలలు ఉండగా, వీటిలో సగానికి పైగా ఉర్దూ మీడియం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉర్దూ మీడియం స్కూల్స్ లో గల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ నాయకులు హుస్సేన్ ఖాన్, షకీల్ పాల్గొన్నారు.




# విద్యార్థినిపై ర్యాగింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.
- పిడిఎస్యు,ఎస్ఎఫ్ఐ డిమాండ్.

**నిజామాబాద్ బ్యూరో విశాల భారతి :** నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థినిపై ర్యాగింగ్ చేసిన విద్యార్థి పై భౌతికంగా దాడి చేసిన సంతోష్ ,శివ నవీన్ లపై చర్యలు తీసుకోవాలని రిజిస్టర్ ప్రొఫెసర్ యాదగిరి కి పిడిఎస్యు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్,ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు ఎల్ ప్రసాద్ లు మాట్లాడుతూ,తెలంగాణ యూనివర్సిటీ అనేక వివాదాలకు ఇప్పటికే కేంద్ర బిందువు అయిం దని, యూనివర్సిటీ ప్రతిష్ట మసకబారిందని, ఇప్పుడు అదనంగా విద్యార్థులపై దాడులు చేసే సంస్కృతి ఇటీవల తరచుగా జరుగుతుందని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీకి ఉన్నత విద్య అభ్యసించడానికి వివిధ జిల్లాల నుండి విద్యార్థిని, విద్యార్థులు వస్తారని అన్నారు. దూర ప్రాంతాలు, ఇతర జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులే హాస్టళ్ళల్లో ఉంటున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో యూనివర్సిటీ హాస్టల్లో విద్యార్థులపై కొద్దిమంది భౌతిక దాడులు చేసిన ఘటనలు తరచుగా జరుగుతున్నాయని అన్నారు. అయినప్పటికీ నివారించే ప్రయత్నాలు జరగలేదని, తాజాగా బాలుర హాస్టల్లో న్యాయశాస్త్రం చదువుతున్న రాము అనే విద్యార్థిపై యూనివర్సిటీలోనీ గ్రౌండ్లో మద్యం సేవించి సంతోష్ ( అప్లైడ్ ఎకనామిక్స్ ), శివ, నవీన్ అనే విద్యార్తులు చేయి చేసుకున్నారని తెలిపారు. హాస్టల్లో విద్యార్థుల ముందే బెదిరించి కొట్టారని అన్నారు. సంతోష్, శివ నవీన్ ల పై చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించాలని డిచ్ పల్లి పోలీస్ స్టేషన్లో రాము ఫిర్యాదు చేశారని అన్నారు. అదేవిధంగా యూనివర్సిటీ మహిళా హాస్టల్ విద్యార్థిని వారికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని, మధ్యాహ్నం సమయంలో సంతోష్, శివ, నవీన్ తదితరులు కొద్దిమంది విద్యార్థుల ను వెంటేసుకుని మహిళా హాస్టల్ వద్దకెళ్లి, పీజీ ఎకనామిక్స్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని పిలిపించుకొని బెదిరించారని అన్నారు. ఆ అమ్మాయిని భయభ్రాంతుల గురిచేసి అందరి ముందు క్షమాపణ చెప్పించుకున్నారని అన్నారు. ఇది చాలా సీరియస్ విషయం,ఈ విషయమై బాధిత విద్యార్థిని డిచ్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఇంత జరుగుతున్న యూనివర్సిటీ అధికారులు, పోలీసులు ఈ ఘటనలపై దర్యాప్తు జరిపి, ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల్ని కొట్టి, భయభ్రాం తులకు గురిచేసిన వారికే, యూనివర్సిటీ అధికారులు వత్తాసు పలుకుతున్నారని బలంగా విశ్వసిస్తున్నామన్నారు. ఇది అత్యంత బాధాకరమైన విషయం ,ఇప్పటికైనా ఈ ఘటనలపై యూనివర్సిటీ అధికారులు వెంటనే దర్యాప్తు జరిపి సంతోష్ శివ, నవీన్ లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పిడిఎస్యు,ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు,నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అశూర్, యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు వెంకటేష్, నాయకులు చిత్రు, దినేశ్ లు పాల్గొన్నారు.



# పారదర్శకంగా పాత వాహనాల వేలం పూర్తి


**యస్.పి కె.అపూర్వ రావు**

**నల్లగొండ విశాలభారతి :** వివిధ కేసులు నమోదైన స్క్రాబ్ వివిధ రకములైన ద్విచక్ర వాహనాలు 96, త్రిచక్ర వాహనాలు 17, ఫోర్ విలర్ వాహనాలు 05, మొత్తం 118 వాహనాలని వేలం పాట వేయడం జరిగింది. గత కొన్ని రోజుల క్రితం పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు సంబంధిత వాహన యజమానులు ఎవరైనా ఉంటే వాహన డాక్యుమెంట్లు చూపించుకుని వాహనాలను తీసుకొని వెళ్లాలని తెలియజేయడం జరిగింది.6నెలల కాల వ్యవధి గడువు ముగిసినందున, జిల్లా పరిధిలోని 118 వివిధ రకాల వాహనాలకు, జిల్లా ఎస్.పి నియమించిన కమిటీ ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకం గా జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం నందు టెండర్ దారుల సమక్షంలో బహిరంగ వేలం వేయబదిందని జిల్లా యస్.పి తెలిపారు. సంబంధిత వాహనాల వేలం పాట ద్వారా 7లక్షల రూపాయలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ యస్.పి కె.ఆర్.కె ప్రసాద రావు, ఎంటివో శ్రీనివాస్, ఆర్ ఐ వెల్ఫేర్ స్పర్జన్ రాజ్, ట్రాఫిక్ సిఐ శ్రీనులు సూపరిండెంట్ దయాకర్ అధ్వర్యంలో పూర్తి చేయడం జరిగింది.



# ఘనంగా మంత్రి ఎర్రబెల్లిజన్మదిన వేడుకలు

- పాలకుర్తిలోకేక్ కట్ చేసిన ఉషా దయాకర్ రావు
- మహా అన్నదాన కార్యక్రమం
- ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు పండ్ల పంపిణీ



**పాలకుర్తి విశాలభారతి :** జనగాం జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంచినీటి సరఫరాల శాఖ మంత్రి ఎర్రబెల్లి.దయాకర్ రావు జన్మదిన వేడుకలు భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు పసునూరి నవీన్ కుమార్ పాలకుర్తి ఎంపీపీ నల్లా నాగిరెడ్డి జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనహృదయనేతగా ప్రజల మన్ననలు పొందిన నేత మంత్రి ఎర్రబెల్లి.దయాకర్ రావు జన్మదిన వేడుకలు పాలకుర్తి నియోజకవర్గం ప్రజల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా పాలకుర్తి నియోజకవర్గ ప్రజల మరియు ఆ భగవంతుని ఆశీస్సులు పూర్తిగా మంత్రి దయాకర్ రావు ఉండటం వలన ప్రజలకు సేవ చేసే అదృష్టం కలిగిందని వారు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం ప్రజలకు ఎంత సేవ చేసినా వారి ఋణం తీర్చలేనిదన్నారు. అంతకుముందు మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులచే సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నిండు నూరేళ్లు దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆ సోమేశ్వర స్వామి దివ్య ఆశీస్సులు ఉండాలని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో మంత్రి ఎర్రబెల్లి.దయాకర్ రావు బర్త్డే కేక్ కట్ చేసి మహా అన్నదానం నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. ముస్కు రాంబాబు, చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వీరమనేని యకాంతరావు మండ రైతు కోఆర్డినేటర్ & స్థానిక గ్రామ సర్పంచ్ బొబ్బల అశోక్ రెడ్డి పాలకుర్తి సొసైటీ బ్యాంకు చైర్మన్ఎ ర్రబెల్లి రాఘవరావు మాజీ కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాచర్ల ఎల్లయ్య బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల వేణు పాలకుర్తి సొసైటీ బ్యాంక్ వైస్ చైర్మన్ ధరావత్ యాకుబ్ నాయక్ మండల ఎస్టి సెల్ అధ్యక్షులు గుగ్గిల్ల యాకయ్య మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పాము శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వివిధ గ్రామాల సర్పంచ్ లు ఎంపిటీసి లు అయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు మాజీ సర్పంచ్ లు ఎంపిటీసి లు మండల గ్రామ పార్టీ ముఖ్య నాయకులు యువజన నాయకులు సోషల్ మీడియా వారియర్స్ అభిమానులు పాల్గొన్నారు.

# చలో వరంగల్ వేలాదిగా తరలిరండి..

**దేవరుప్పుల విశాలభారతి :** ఈ నెల 8వ తేదిన భారత ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటనను పురస్కరించుకొని హనుమకొండ ఆర్ట్ ఆండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్స్ లో నిర్వహించే సేవా సుపరిపాలన బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి,పెదగాని సోమయ్య లు తెలిపారు. దేవరుప్పుల మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పేదల వ్యతిరేకవైఖరిని ఎండగట్టే విధంగా బీజేపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో,బీజేపీ పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్ కుమార్, ప్రధాన కార్యదర్శి సత్తన్న, బీజేవైఎం కరుణాకర్ శక్తి కేంద్రం ఇంచార్జ్ లు పాలడుగు ఉప్పలయ్య, అయిలయ్య, నాగపూరి రమేష్,గణేష్, మడికొండ మహేష్,ఉదయ్,పన్నీరు రాజు,సామల సదానందం,అనిల్ ,కళ్యాణ్ పాల్గొన్నారు.తదనంతరం తమిళనాడు నుండి విచ్చేసిన విస్తారాకులను రాజేష్ గారిని మరియు విష్ణు గారిని సన్మానించడం జరిగింది.



## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**తుర్కయంజాల్ విశాలభారతి :** వర్షాకాలం, బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని అధికారులు సమన్వయంతో పనిచేయాలని తుర్కయంజాల్ మున్సిపాలిటి చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి సూచించారు. మంగళవారం రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో కౌన్సిలర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ రాంరెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని అన్ని వార్డుల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిం,ఇ ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్నారు. వార్డుల్లో నీటి సమస్య, పైప్‌లైన్ మరమ్మతులు, స్ట్రీట్‌లైట్స్‌ను వెంటనే సరిచేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ శ్రీలత అనిల్‌కుమార్, కౌన్సిలర్లు కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, రేవల్లె హరితాయాదగిరి, కమిషనర్ సాబేర్ అలీ, డీఈ సత్యనారాయణ, ఎలక్ట్రిక్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ గుణాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## 'సమస్యలు పరిష్కరించండి'

**ఇబ్రహీంపట్నం విశాలభారతి :** మంచాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జెడ్పీటీసీ నిత్య నిరంజన్‌రెడ్డి కోరారు. జెడ్పీ సర్వసభ్య సమావేశంలో నిత్య నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం ఉపాధ్యాయుల కొరత వల్ల గత సంవత్సరం పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో అన్ని వసతులను కల్పించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల అవకాశం ఉన్నందున ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం 965మంది రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి... 200మందికే డబ్బు జమ చేసిందని, మిగిలినవారికీ వెంటనే డబ్బులు చెల్లించాలన్నారు.

## అరుణాచలం బస్సు యాత్ర విజయవంతం

- సూర్యాపేట డీఎం సురేందర్
- టీఎస్ఆర్టీసీ, ఎండీ సజ్జనార్ కు థాంక్స్ చెప్పిన భక్తులు

**సూర్యాపేట విశాలభారతి :** గురు పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు భక్తుల సౌకర్యార్థం సూర్యాపేట డిపో నుండి ఏర్పాటు చేసిన అరుణాచలం స్పెషల్ బస్సు యాత్ర విజయవంతమైనట్లు సూర్యాపేట డీఎం డి.సురేందర్ మంగళవారం తెలిపారు.ఈనెల 2న ఆదివారం సూర్యాపేట కొత్త బస్టాండ్ నుండి 36 మంది ప్రయాణికులతో అరుణాచలం గిరి ప్రదక్షిణకు బయలుదేరి వెళ్లిన స్పెషల్ బస్ మంగళవారం సూర్యాపేటకు చేరుకున్నట్లు తెలిపారు. అరుణాచలం బస్ యాత్రకు భక్తుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు.అరుణాచల గిరి ప్రదక్షిణ,దర్శనం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. అరుణాచలంకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసిన టీఎస్ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ కు ధన్యవాదాలు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా తమను తీసుకుపోయి తీసుకు వచ్చినట్లు చెప్పారు. ప్రతినెల అరుణాచలంకు ప్రత్యేక సర్వీస్ నడుపాలన్నారు. మరిన్ని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. గురు పౌర్ణమి రోజున అరుణాచల దర్శనం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

# పోడు భూములకు పట్టాలు ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



**ఆల్లపల్లి విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం పరిధిలోని ఆళ్లపల్లి మండల మర్కోడులో మంగళవారం రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పోడు భూముల పట్టాల పంపిణీ చేశారు. ఆయన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన 2082 లబ్ధిదారులకు 13938 ఎకరాలకు సంబంధించిన పోడు భూముల హక్కు పత్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వారి చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషితో పంపిణీ చేసిన పోడు పట్టాలతో గిరిజన జీవితంలో వెలుగులు విరజిమ్మయని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ లేవన్నారు సీఎం కేసీఆర్ గిరిజన సంక్షేమంపై పోడు దారులకు పట్టాలను అందించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. అలాగే పోడు పట్టాలను అందించిన ప్రతి రైతుకు రైతుబంధు రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని గిరిజనుల వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ పోడు భూములకు హక్కు పత్రాలను అందిస్తూ రైతుబంధు రైతు బీమా పథకాలను వర్తింపజేస్తూ కార్యక్రమాన్ని చేపట్టారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గిరిజనులకు ఎన్నో ఇబ్బందులు తప్పయ అన్నారు, సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో తీసుకున్న నిర్ణయాల కారణంగానే పట్టాలు పంపిణీ జరుగుతున్నది అన్నారు.

# బీజేపీలో బీసీ ఎజెండా పాతరేసినట్టేనా..?

- పార్టీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డికి ఇవ్వడం పట్ల ఆ పార్టీలోనే అసంతృప్తి...
- - ఈ మార్పు వెనుక చినజీయర్ చక్రం తిప్పాడా..?



**నిజామాబాద్ బ్యూరో విశాల భారతి :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ మార్పు ఆ పార్టీని మరింత ప్రశ్నార్థకంలో పడేసింది. ఇప్పటికే కర్ణాటక ఫలితాల హవాతో కాంగ్రెస్‌కు మంచి వాతావరణం ఏర్పడుతున్న తరుణంలో ఈ మార్పులు బీజేపీలో కొత్తగా ఊపు తెచ్చేవి కాకపోగా.. మరింత దిగజార్చేవిగా ఉన్నవి. పార్టీ అధ్యక్ష బాధ్యతలు కిషన్‌రెడ్డికి ఇవ్వడం పట్ల చాలా మంది నేతలకు మింగుడు పడలేదు. బండి సంజయ్ దూకుడు మాస్‌కు బాగా దగ్గర చేసింది. యూత్‌ను అట్రాక్ట్ చేసింది. పార్టీని వీడి పోవాలనే నేతలెందరినో ఆయన బుజ్జగింపు ఆపుకున్నాడు. భవిష్యత్ మనదేనని .. సరైన న్యాయం చేస్తానని మాటిస్తూ అందరినీ కాపాడుకుంటూ వచ్చాడు. ఎప్పటినుంచో బండి సంజయ్ మార్పుపై కథనాలు వస్తూనే ఉన్నాయి. కానీ బీసీ మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన బండి సంజయ్‌ను మార్చితే బీసీల్లో మరింత వ్యతిరేకత పార్టీ పట్ల ఏర్పడుతుందని అధిష్టానం భావించింది. దీంతో ఆయన పదవి జోలికి వెళ్లలేదు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌తో కూడా ఈ మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి. వాస్తవంగా బండికి పార్టీ రాష్ట్ర పగ్గాలు ఇవ్వడం చాలా గొప్ప విషయం. దాన్ని అంతో ఇంతో నిలుపుకుంటూ వచ్చాడు బండి. మాటలో స్పష్టత లేకున్నా దూకుడుగా ప్రవర్తించి.. సమయానుసారం, సందర్భాను సారం తనదైన శైలిలో స్పందించడం, పార్టీ కార్యకర్తలను, నాయకులను కాపాడుకోవడంలో ఆయనకు మంచి పేరుంది. కానీ కిషన్ రెడ్డిని ఓ మేథావి వర్గంగా చూస్తారు. ఆయన ప్రెస్‌మీట్లకే పరిమితమవుతాడే తప్ప రాష్ట్ర వ్యాప్తంగాఉన్న పార్టీ పట్ల ఆయనకు సరైన అవగాహన,అనుభవం లేదనే చెప్పాలి. ఇప్పటికే బీసీలు పార్టీకి దూరమవుతున్నారనే అపవాదును మూటగట్టుకున్న బీజేపీ బండిని తొలగించి మరింతగా బీసీలతో గ్యాప్ పెంచుకున్నది. మరోవైపు కిషన్‌రెడ్డి నియామకం పట్ల చినజీయర్ చక్రంతిప్పారనే ప్రచారం చాలా సర్కిళ్లలోజోరందుకున్నది.బీఆరెస్, బీజేపీకి మధ్య ఇప్పటికే పెరిగి ఉన్న అగాథం..ఇప్పుడు కిషన్ రెడ్డి సారథ్యంలో సంబంధాలు మెరుగుపడతాయనే అభిప్రా యాన్నీ ఆ పార్టీ నేతలే వ్యక్తం చేయడం గమనార్హం.

## బాలికల ఆశ్రమ పాఠశాలలో టాయిలెట్స్ సమస్యను పరిష్కరించాలి



**మహబూబాబాద్ విశాల భారతి :** నూతనంగా ప్రారంభమైన ఆశ్రమ పాఠశాల భవనంలో విద్యార్థినీలకు టాయిలెట్స్ నిర్మాణం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కురవి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల ముందు విద్యార్థినీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ భవనం పూర్తి అయి మూడు సంవత్సరాలు కావాస్తున్న కనీసం మరుగుదొడ్ల నిర్మించకుండా ప్రారంభం చేయడం ఏంటి అని ప్రశ్నించారు. జిల్లా అధికారులు కనీసం విద్యార్థీలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయ్యారు అని అన్నారు. ఆ భవనంలో కనీసం నీటి సాదుపాయం కూడా లెదు అన్నారు. ఆశ్రమ పాఠశాల భవనం నిర్మించిన కాంట్రాక్టర్ ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా, డబ్బులను దండుకున్నారు అని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో కనీసం ఆడుకోవడానికి ఆట స్థలం కూడా లేదు అన్నారు. విద్యార్థులకు ఏమైన అవసరం ఉంటే హస్టల్ కి వెళ్లి రావాల్సిన పరిస్థితి వచ్చింది అన్నారు. తక్షణనే కురవి ఆశ్రమ పాఠశాల భవనంలో నెలకొన్న సమస్యలు 10 రోజులలో పరిష్కారించాలని, లేని యెడల విద్యార్థులతో కలిసి రొడ్డు పైన బైటాయిస్తాం అని హెచ్చారించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గందసిరి జ్యోతి బసు,మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలిపాక వీరెందర్, నిమ్మిశెట్టి మురళి వెంకటేష్, వాసు ,ప్రణీత్ పాల్గొన్నారు.

# కబ్జా ఎంది అని అడిగితే గొడ్డలితో దాడి

**దేవరకొండ విశాలభారతి :** నిజంగా సమాజం ఎతుపోతుంది అనిపిస్తుంది. చిన్న పంచాయతీ కూర్చుని మాట్లాడుకుంటే అయిపోయేది. నా ఇంటి స్థలం కబ్జా చేసినవు అని అడిగినందుకు గొడ్డలితో దాడి. మూర్కత్వమో, అనాగరికమో అర్థం కావట్లేదు. దేవరకొండ నియోజకవర్గం పీఏ పల్లి మండలం వద్దిపట్ల గ్రామం లో సట్టు పద్మ ప్లాట్ వెనకాల ఉన్న కొంత జాగని కబ్జా చేశారు. బజారుని కూడా అక్రమించారని సదరు వ్యక్తులు మండలి కొండలు అతని కుటుంబం సభ్యులను అడగగా గొడవ జరిగింది. 3వ తారీకు సోమవారం సాయంత్రం 7గం.ల ప్రాంతంలో మండలి కొండలు అతని కుటుంబ సభ్యులు సట్టు పద్మ ఇంటిపై కర్రలు గొడ్డలితో దాడికి యత్నించారు.



ఈ క్రమంలో సట్టు పద్మ కుమారుదు సట్టు హరీష్

పై మండలి కొండలు గొడ్డలితో దాడి చేయగా చేతికి, కాలికి బలమైన గాయాలు అయ్యాయి. ఈ దాడితో సట్టు పద్మ కుటుంబం భయభ్రాంతులకు లోనవ్వడంతో గుడిపల్లి పోలీస్ స్టేషన్ పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గొడ్డలితో దాడి చేసిన వ్యక్తి ని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ చేస్తామని ఎస్.ఐ రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై బాధితులు సట్టు పద్మ, ఆమె కుమారుదు హరీష్‌లు మాట్లాడుతూ బూమి కబ్జా చేసావు, రోడ్డు కబ్జా చేసావు అని అడిగితే గొడ్డళ్లు, కర్రలతో దాడి చేయడం అమానుషం అని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిందితులపై అండర్ సెక్షన్ 448, 324, 504 లపై కేసు నమోదు చేశారు.

## కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం ..ఏక కాలంలో 2 లక్షల రుణ మాఫీ



**వికారాబాద్ విశాల భారతి:** కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరా రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధి లోని మొమిన్ కలన్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువకులు పార్టీ లో అత్తర్ పాషా, ఫయాజ్ పాషా, ఎండి షఫీ, ఎండి ఇమ్రాన్, ఎండి గౌసుద్దీన్, ఎండి ఖాదర్, ఎండి ముతాలిబ్, ఎండి రోషన్, ఎండి కాజా పాషా, ఎండి లతీఫ్, ఎండి అప్రోచ్ ,పెద్ద మొత్తంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేశారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వల్లనే బడుగు బలహీన వర్గాలు అన్ని అభివృద్ధి చెందుతాయని , కర్ణాటకలో కానీ రాజస్థాన్ లో గాని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి బాగుందని ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. 500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తుందని తెలంగాణలో కూడా రాబోయేది కాంగ్రెస్ పార్టీ కాబట్టి,కాంగ్రెస్ పార్టీ చేసే అభివృద్ధిలో తమ వంతు భాగస్వామ్యం ఉండాలని కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని యువకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి విజయభాస్కర్ రెడ్డి గారు, మండల మాజీ జెడ్పిటిసి పట్లోళ్ల రాములు గారు, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ అబ్దుల్ రెహమాన్, మల్ రెడ్డి, బలవర్ధన్ రెడ్డి, బాబు మియా,రాజ్ మహమ్మద్, యూసుఫ్, బలరాం రెడ్డి, పాల్గొన్నారు.



## పంచాయతీ కార్మికులకు న్యాయం చేయండి

**ఇబ్రహీంపట్నం విశాలభారతి :** కేసీఆర్ సర్కార్ గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం నాయకుడు ఏర్పుల నర్సింహ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ రూ.8500 జీతం ఇవ్వాలన్నారు. గ్రామంలో ముగ్గురు కార్మికులకే ఇస్తామనడం అన్యాయన్నారు. ప్రతి నెల ఇవ్వాల్సిన సబ్బులు, నూనె, చెప్పులు, డ్రస్సులు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత ఇవ్వడంలేదని ఆరోపించారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఈనెల 6నుంచి జరగబోయే సమ్మెను విజయవంతం చేయాలని నర్సింహ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలతో సమ్మెనోటీసు మెమోరాండాన్ని ఎంపీడీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుండె శివకుమార్, అంజయ్య, పోశయ్య, లక్ష్మమ్మ, లలిత, కవిత, జ్యోతి, లక్ష్మయ్య, శోభ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదం విద్యార్థులు అక్కడికక్కడే మృతి.

**ఇబ్రహీంపట్నం విశాలభారతి :** ఇబ్రహీంపట్నం నుండి రాయిపోలు వెళ్లే దారిలో పెట్రోల్ బంక్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదం లో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనాన్ని డికొన్న కారు ప్రమాదంలో భారత్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులుగా పోలీసులు గుర్తించినట్లుగా తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం మృతులు హైదరాబాద్ హస్తినాపురం చెందిన నవీన్ , లంగర్ హౌస్ కు చెందిన భాను ప్రసాద్ మరియు రంగారెడ్డి జిల్లా కందుకూరు నివాసి నారాయణ రెడ్డిలుగా తెలిపారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను ఇబ్రహీంపట్నం లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## వినోద్, అంజత్ ల మృతి బాధాకరం

- ఓజో ఫౌండేషన్ ఛైర్మన్ పిల్లుట్ల రఘు
- ట్రాక్టర్ బోల్తా పడి గుర్రంపోడు తండా, వేపల సింగారం వాసి మృతి
- యువత అధిక స్పీడ్ తో వావనాలు నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు

**హుజూర్ నగర్ విశాలభారతి:** మెళ్ళచెరువు మండల పరిధిలోని గుర్రంపోడు తండా గ్రామానికి చెందిన ముడావత్ వినోద్ ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందడం చాలా బాధాకరమని ఓజో ఫౌండేషన్ ఛైర్మన్ పిల్లుట్ల రఘు అన్నారు. వేపల సింగారం గ్రామానికి చెందిన షేక్ నాగులు మీరా కుటుంబం ట్రాక్టర్ ప్రమాదామలో చిన్న కొడుకు అంజత్ మృతి చెందడం తండ్రి పరిస్థితి విషమంగా ఉండటం బాధకరం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చాలా మంది ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. యువత వావానాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని రాత్రి పూట ప్రమాదకరంగా వాహానాలు నడపకూడదని అన్నారు. వినోద్, అంజత్ కుటుంబానికి రఘు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు.




## పోరాట స్ఫూర్తి రగిలించిన అగ్గి రవ్వ దొడ్డి కొమరయ్య

- కొత్తపల్లి శివ కుమార్ సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి

**సూర్యాపేట విశాలభారతి :** తెలంగాణ తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 77వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ విక్రమ్ భవన్ లో సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా ఆధ్యర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో జులై 4 అతి ముఖ్యమైన రోజు వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి అంకురార్పణ జరిగిన రోజు అన్నారు.భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోనే మహోజ్వల ఘట్టంగా భాసిల్లిన వీర తెలంగాణ పోరాటాన్ని రగిలించిన అగ్గి రవ్వ దొడ్డి కొమురయ్య అన్నారు. దొడ్డి కొమురయ్య యాది,వీర తెలంగాణ పోరాట స్ఫూర్తి,నేటి తరానికీమార్గదర్శి అయ్యి నేడు మనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలిచాడని కొనియాడారు.కామ్రేడ్ దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారానికై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్,ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ,జీవన్,వాజీద్,వీరబాబు,సునీల్, శ్రీకాంత్, శైలజ,పద్మ,వెంకటమ్మ,లింగయ్య,బావ్ సింగ్ ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# భోళా శంకర్ షూటింగ్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి, స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ దర్శకత్వంలో చేస్తున్న మెగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోలా శంకర్' టీజర్‌లో తన వింటేజ్ స్టైలిష్ మాస్ అవతార్‌లో కనిపించారు. భోళా శంకర్‌లో చిరంజీవి పవర్‌ప్యాక్‌తో కూడిన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. "భోళా శంకర్ షూట్ పూర్తయింది. రాత్రి పగలు విరామం లేకుండా పని చేస్తున్న నటీనటులు & సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఫుల్ స్వింగ్‌తో జరుగుతున్నాయి. ప్రమోషన్‌లు & పాటలు విడుదల కాబోతున్నాయి. భోళా శంకర్ ఆగస్టు 11వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల. #BholaaShankar @KChiruTweets "అని మెహర్ రమేష్ ట్వీట్ చేశారు. సినిమాలోని ఫస్ట్ సింగిల్ ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. మిగిలిన పాటలు ఒకదాని తర్వాత ఒకటి విడుదలౌతాయి. మహతి స్వర సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ మెగా మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రామబ్రహ్మం సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# గుడ్ న్యూస్ చెప్పబోతుందా ?



స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సింగిల్ గానే ఉన్న విషయం తెల్సిందే. నాగ చైతన్య తో సుదీర్ఘ కాలం ప్రేమలో ఉన్న సమంత మూడు ముళ్ల బంధంతో ఒక్కటి అయ్యింది. కానీ ఇద్దరి మధ్య ఆ మూడు ముళ్ల బంధం ఎక్కువ కాలం నిలవలేదు. నాగ చైతన్య మరియు సమంత సైలెంట్ గా విడి పోయారు. విడాకులు తీసుకున్న తర్వాత ఇద్దరు కూడా వరుసగా సినిమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆ మధ్య నాగ చైతన్య ఒక హీరోయిన్ తో ప్రేమలో ఉన్నాడు అంటూ పుకార్లు షికార్లు చేశాయి. ఆ విషయంలో నిజం ఎంత ఉంది అనేది ఇప్పటి వరకు క్లారిటీ లేదు. చైతూ ప్రేమలో ఉన్నాడా లేదా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సమంత కూడా ప్రేమలో ఉంది.. రెండో పెళ్లికి సిద్ధం అవుతోంది అంటూ పుకార్లు షికార్లు చేశాయి. అవన్నీ నిజం కాదని పలు సందర్భాల్లో ఆమె చెప్పకొచ్చింది. కానీ తాజాగా సోషల్ మీడియా లో సమంత స్వయంగా పోస్ట్ చేసిన ఒక పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ పోస్ట్ చూస్తూ ఉంటే సామ్ ప్రేమలో ఉందా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

'చావు నుంచి మనల్ని ఏది కాపాడలేదు.. కనీసం ప్రేమతో అయినా జీవితాన్ని కాపాడుకుందాం' అనే అర్థం వచ్చే విధంగా పాబ్లో నెరుడా కొటేషన్ ను షేర్ చేసింది. ప్రేమ వల్లే జీవితం బాగుంటుంది అంటూ సమంత భావిస్తున్నట్లుగా పోస్ట్ పెట్టింది కనుక ఆమె ప్రేమలో ఉందేమో.. లేదా ప్రేమలో పడాలి అనుకుంటుందేమో అంటూ ఎవరికి తోచిన విధంగా వారు ఊహించేసుకుంటున్నారు.


మొత్తానికి సమంత త్వరలోనే ఏదో ఒక గుడ్ న్యూస్ చెబుతుందేమో అంటూ నెటిజన్స్ తో పాటు ఆమె అభిమానులు మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో సమంత షేర్ చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. సమంత ప్రస్తుతం సిటాడెల్ అనే హిందీ సిరీస్ లో నటించడంతో పాటు ఖుషి సినిమాలో నటిస్తున్న విషయం తె

# 'హత్య' నుంచి పాట విడుదల

బిచ్చగాడు2 మూవీతో రీసెంట్ సూపర్ హిట్ అందుకున్న తమిళ హీరో విజయ్ అంటోని.. మరో సినిమాతో అలరించేందుకు రెడీ అవుతున్నాడు. సరికొత్త లైన్‌తో క్రైమ్ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో హత్య సినిమాతో ఆడియన్స్ ముందుకు రానున్నాడు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ ఆంటోని డిటెక్టివ్ పాత్రలో కనిపించనున్నాడు. హీరోయిన్‌గా రితికా సింగ్ నటిస్తోంది. ఇటీవల రిలీజ్ చేసిన ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ మూవీ నుంచి ఎవరు నువ్వు..? అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్ మేకర్స్ రిలీజ్ చేశారు. ఎవరు నువ్వు..? అంటూ సాగే ఈ పాట.. ప్రేక్షకులను సరికొత్త ట్రాన్స్‌లోకి తీసుకు వెళ్లేలా ఉంది. ఈ పాటను ఎంఎస్ కృష్ణ, అంజనా రాజగోపాలన్ ఆలపించగా.. భవ్యశ్రీ సాహిత్యం అందించారు. గిరీష్ గోపాలకృష్ణన్ అందించిన మ్యూజిక్ వినసొంపుగా ఉంది. ఈ పాటతో సినిమాపై మరింత అంచనాలను పెంచేశారు మూవీ మేకర్స్. బాలాజీ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన హత్య మూవీ జూలై 21న థియేటర్లలోకి రాబోతుంది. కంప్లీట్ మేకోవర్‌తో.. సరికొత్త కొత్త లుక్‌లో స్టైలిష్‌గా విజయ్ ఆంటోని కనిపిస్తున్నాడు. కొత్త కథలు, డిఫరెంట్ కాన్సెప్ట్‌లతో ప్రేక్షకులను అలరించేందుకు విజయ్.. మరోసారి అలాంటి స్టోరీనే ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. లోటస్ పిక్చర్స్‌తో కలిసి ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ హత్య మూవీని నిర్మిస్తోంది. కమల్ బోరా, జి.ధనుంజయన్, ప్రదీప్ బి, పంకజ్ బోరా, విక్రమ్ కుమార్, తాన్ శ్రీ దొరైసింగం పిళ్లై, సిద్ధార్థ్ శంకర్, ఆర్‌వీఎస్ అశోక్ కుమార్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరిస్తున్నారు.



# 'జవాన్' ట్రైలర్ రెడీ




బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్.. ఏడాది 'పఠాన్' చిత్రంతో వరల్డ్ వైడ్‌గా సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై 'జవాన్' చిత్రంతో దండయాత్ర చేసి బాక్సాఫీస్‌ను కొల్లగొట్టడానికి రెడీ అయ్యారు. దీని కోసం ఆయన అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఎగ్జయిట్‌మెంట్‌తో వెయిట్ చేస్తున్నారు. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 7న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో భారీ ఎత్తున రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో 'జవాన్' ట్రైలర్‌ను ఆడియెన్స్ ముందుకు తీసుకురావటానికి మేకర్స్ భారీ సన్నాహాలు చేస్తున్నారు. 'మిషన్ ఇంపాజిబుల్' సినిమా థియేటర్స్‌లో జవాన్ ట్రైలర్‌ను ప్రదర్శించబోతున్నారు. ఎమోషనల్ రోలర్ కోస్టర్‌గా అబ్బుర పరిచే యాక్షన్ సన్నివేశాలతో ప్రేక్షకులకు వారి సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడుతుందని చిత్ర యూనిట్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. అసలు ఈ సినిమా కోసం షారూక్ ఖాన్ ఎవరూ ఊహించని సరికొత్త లుక్‌లోకి మారారు. ఆ లుక్‌ను చూసి ఆయన అభిమానులు ఆశ్చర్యపోయారు. దీంతో షారూక్ ఖాన్ పాత్ర ఎలా ఉండబోతుందోనని అందరిలో ఉత్కంఠత నెలకొంది. దీంతో జవాన్ మూవీ ట్రైలర్‌ను చూడాలని అందరూ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఎన్నో వైవిధ్యమైన చిత్రాలతో అభిమానులను మెప్పించిన ఈ స్టార్ హీరో ఇప్పుడు జవాన్ చిత్రంలో ఎలా ఆకట్టుకోబోతున్నాడనేది అందరిలోనూ క్యూరియాసిటీని కలిగిస్తోంది.



# ఇలా జరుగుతుందనుకోలేదు!

మిల్కీ బ్యూటీ తమన్నా రెండు దశాబ్దాల సుదీర్ఘ సినీ కెరీర్ లో ఎప్పుడు లేని విధంగా బ్యాక్ టు బ్యాక్ వెబ్ సిరీస్ ల్లో నటిస్తూ.. అది కూడా బోల్డ్ కంటెంట్ విచ్చలవిడిగా ఉండే సిరీస్ ల్లో నటిస్తూ తనను తాను మరింతగా జనాల్లోకి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసింది. కానీ ఆ రెండు సిరీస్ ల వల్ల తమన్నా ఇమేజ్ డ్యామేజ్ అయ్యిందే తప్ప మంచి జరగలేదు. జీ కర్దా మరియు లస్ట్ స్టోరీస్ 2 సిరీస్ ల వల్ల ఓటీటీ ప్రేక్షకులకు చేరువ అవ్వాలని ఆశ పడ్డ మిల్కీ బ్యూటీ తమన్నా కు విమర్శలు తప్పడం లేదు. జీ కర్దా లో బెడ్ రూమ్ సన్నివేశాల్లో నటించి షాక్ ఇచ్చిన తమన్నా లస్ట్ స్టోరీస్ 2 లో బోల్డ్ సన్నివేశాల్లో నటించి అభిమానుల నుండి విమర్శలు ఎదుర్కోవడం జరిగింది. మొత్తానికి తమన్నా కు భారీగానే డ్యామేజీ అయ్యింది. తాజాగా తనపై సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్ కు మిల్కీ బ్యూటీ తమన్నా స్పందించింది. ప్రస్తుత జనరేషన్ ప్రేక్షకులు కూడా నన్ను విమర్శిస్తారని... ఆ సీన్స్ మరియు డైలాగ్స్ కు ట్రోల్స్ చేస్తారు అనుకోలేదు అంది. తప్పకుండా ఈ జనరేషన్ వారికి నచ్చుతుందని అనుకున్నాను. కానీ నన్ను వారు ఇలా చూడాలి అనుకోవడం లేదని నాకు అర్థం అయ్యింది.. కనుక ముందు ముందు తన నిర్ణయాల విషయంలో మరింతగా ఆలోచిస్తాను అన్నట్లుగా తమన్నా పేర్కొంది

# షూటింగ్ పూర్తి చేసుకున్న జిగర్ తండా డబుల్ ఎక్స్



దర్శక నిర్మాత కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్షన్‌లో స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై కార్తికేయన్ నిర్మిస్తోన్న చిత్రం 'జిగర్ తండా డబుల్ ఎక్స్'. రాఘవ లారెన్స్, ఎస్.జె.సూర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హై యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో దీపావళికి గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. 'జిగర్ తండా డబుల్ ఎక్స్'మూవీ అనౌన్స్‌మెంట్ రోజు నుంచే ఎక్స్‌పెక్టేషన్స్ క్రియేట్ అయ్యాయి. అందుకు కారణం.. 2014లో విడుదలై బ్లాక్ బస్టర్ అయిన జిగర్ తండా చిత్రానికి ఇది ప్రీక్వెల్. సినిమా ఎలా ఉండబోతుందోనిన అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ "'జిగర్ తండా డబుల్ ఎక్స్' మూవీ షూటింగ్ అంతా పూర్తయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. జింగ్ తండాకు ప్రీక్వెల్‌గా రాబోతున్న 'జిగర్ తండా డబుల్ ఎక్స్'ను ఈ దీపావళికి తెలుగు, తమిళ, హిందీ భాషల్లో భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాం" అన్నారు. స్టోన్ బెంచ్ ఫిలింస్ అధినేత కార్తికేయన్ సంతానం మాట్లాడుతూ "జిగర్ తండా డబుల్ ఎక్స్" హై యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. అనుకున్న ప్లానింగ్ ప్రకారం సినిమాను పూర్తి చేశాం. షూటింగ్ కంప్లీట్ అయ్యింది. దీపావళికి భారీ ఎత్తున తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నాం" అన్నారు

# శేఖర్ చంద్ర నుండి మరో బ్లాక్ బస్టర్

బ్యాక్ టూ బ్యాక్ చార్ట్ బస్టర్స్ హిట్ సాంగ్స్ డెలివేరీ చేస్తూ టాలీవుడ్ సంగీత దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకుంటున్నాడు శేఖర్ చంద్ర. తాజాగా సందీప్ కిషన్ నటిస్తున్న 'ఊరు పేరు బైరవకోన' సినిమా కోసం శేఖర్ చంద్ర కంపోజ్ చేసిన "నిజమే నే చెబుతున్నా" లవ్ సాంగ్ యూ ట్యూబ్ లో 30 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుంది. ఇన్స్టా లో రీల్స్ తో ట్రెండింగ్ లో ఉంది. శేఖర్ చంద్ర స్వరపరిచిన ఈ పాటకి శ్రీమణి సంగీతం అందించగా, సిద్ శ్రీరామ్ పాడారు. శేఖర్ చంద్ర , సిద్ శ్రీరామ్ కాంబినేషన్ లో ఇప్పటికే "బాగుంటుంది నువ్వు నవ్వితే" , "ప్రియతమా ప్రియతమా" , 'మనసు దారి తప్పేనే' వంటి సూపర్ హిట్ సాంగ్స్ వచ్చాయి. వీరిద్దరి కాంబోలో వచ్చిన నాలుగవ సాంగ్ ఇది. ప్రస్తుతం సోషల్ మీడియాలో శేఖర్ చంద్ర 'నిజమే చెబుతున్నా" సాంగ్ వైరల్ అవుతూ మ్యూజిక్ లవర్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటుంది. సాంగ్ సినిమాపై మంచి బజ్ తీసుకొచ్చింది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.